శుక్రవారం
31-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 277
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మే21న సార్వత్రిక ఎన్నికలు

గ్రీస్ ప్రధాని మిట్సోటకీస్ ప్రకటన

గ్రీస్ సార్వత్రిక ఎన్నికలు మే 21వ తేదీన జరగనున్నట్లు ఆ దేశ ప్రధాని కిరియాకోస్ మిట్సోటాకిస్ ప్రకటించారు. 'దేశానికి, పౌరులకు స్పష్టత అవసరం. మేము మరింత ధైర్యంగా, రాజీపడకుండా పనిచేస్తాం' అని కేబినెట్ సమావేశం ప్రత్యక్ష ప్రసారంలో ప్రధాని తెలిపారు.

2లో

సామాజిక న్యాయంపై 3న విపక్షాల సమావేశం

న్యూఢిల్లీ: దేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం చెన్నైలో ప్రతిపక్షపార్టీల సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సహా 20 ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యక్తిగతంగానూ లేదా వర్చువల్‌గా పాల్గొంటారని విపక్ష నేతలు చెప్పారు. భారతదేశంలో సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లడం అనే అంశంపై సమావేశంలో చర్చిస్తారు.

జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకుడు ఫరూక్ అబ్దుల్లా, బీఆర్ఎస్ నేత కె.కేశవరావు, సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, ఆప్ నేత సంజయ్‌సింగ్, టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ సమావేశానికి హాజరవుతారు. బీజేడీ నేత శస్మిత్ పాత్ర, వైసీపీ నేత ఎన్.సురేశ్ హాజరవుతారని భావిస్తున్నారు. ఇలాంటి సమావేశానికి ఈ నాయకులు హాజరుకానుండటం ఇదే మొదటిసారి.

ఇది ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీల సమావేశం అయినప్పటికీ సామాజిక న్యాయంపై చర్చ కాబట్టి బీజేడీ, వైసీపీ కూడా హాజరుకావచ్చని భావిస్తున్నారు. ఎన్‌సీపీ, శివసేన(ఉద్ధవ్) పార్టీలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు

పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తికి

పది వేల కోట్లు ఇవ్వండి

- పెరిగిన అంచనా వ్యయాన్ని ఆమోదించండి
- విభజన అంశాల అమలుకు చర్యలు తీసుకోండి
- అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌కు వినతి
- ముగిసిన రెండు రోజుల జగన్ ఢిల్లీ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీ రెండు రోజుల ఆకస్మిక పర్యటన ముగిసింది. బుధవారం అర్ధరాత్రి కేంద్రం హోం మంత్రి అమిత్‌షాతో సుమారు 40 నిమిషాలు భేటీ అయిన సీఎం జగన్... గురువారం కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా నిర్మలా సీతారామన్‌ను కోరారు. అనంతరం సీఎం ఢిల్లీ పర్యటన ముగించుకుని తాడేపల్లి చేరుకున్నారు. ఇద్దరు మంత్రుల వద్ద మళ్లీ పాత అంశాలనే ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి తాత్కాలికంగా రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని జగన్ కోరారు. డయాఫ్రం వాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ.2020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చుచేసిన రూ.2600.74 కోట్లను సత్వరమే తిరిగి చెల్లించాలని, ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ.55,548 కోట్లుగా నిర్ధారించిందని, దీనికి వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. దీంతోపాటు ప్రాజెక్టుకు సంబంధించి ఇతరత్రా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.2,500 కోట్లు వెంటనే మంజూరు చేయాలని విన్నవించారు. ప్రస్తుత ప్రభుత్వం తప్పులేకున్నా... రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని తగ్గించారు. 2021-22లో రూ.42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లకు కుదించారు. ఇది సరికాదు. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని జగన్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉందని, ఈ డబ్బును వెంటనే ఇప్పించాలని అడిగారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద పెండింగ్‌లో ఉన్న 36,625 కోట్ల రూపాయల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. చివరి అంశంగా...రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం ఇచ్చిన హామీ మరోసారి సీఎం జగన్ కేంద్ర మంత్రులకు గుర్తుచేశారు.

నేడు మన్యం బంద్

భారీగా బలగాల మోహరింపు

3లో

అమిత్‌షాతో జగన్ రహస్య ఒప్పందం

- రాహుల్‌ను వేధిస్తున్న మోదీ సర్కార్
- ఏప్రిల్ 14 నుంచి దేశ్ బచావో- మోదీ హటావో
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్రబ్యూరో–తిరుపతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 'దేశ్ కా బచావో–మోదీ హటావో' నినాదంతో ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. తిరుపతి బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాహుల్‌గాంధీ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమం చేపడతామని తెలిపారు. రాహుల్‌ను ప్రధాని మోదీ రాజకీయంగా హత్య చేశారని, ప్రజాకోర్టులో మోదీని దోషిగా నిలబెట్టి ప్రజలు ఘోరంగా ఓడిస్తారని పేర్కొన్నారు. వివేక హత్య కేసు ఓ కొలిక్కి వచ్చే సమయంలో కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా కమిటీ వేయించి సీఎం జగన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తోందని, జగన్‌ను అన్ని విధాలా వాడుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. జగన్ పదేపదే ఢిల్లీకి ఎందుకు పరుగులు పెడుతున్నారో బట్టబయలైందని, వివేకానందరెడ్డి హత్య కేసుతో భయపడి జగన్ ఢిల్లీ వెళ్లారని చెప్పారు. అమిత్ షాతో జగన్ రాజకీయ ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్య కేసు నుంచి తప్పిస్తే...కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు గెలిపిస్తానని అమిత్ షాకు జగన్ హామీ ఇచ్చారని వెల్లడించారు. జగన్ సంపాదించిన అక్రమ ఆస్తులు

- మిగతా 2 లో

సీఎం జగన్ మంకుపట్టు వీడాలి

- అమరావతినే రాజధానిగా స్పష్టమైన ప్రకటన చేయాలి
- రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇకనైనా మంకుపట్టు వీడాలని, అమరావతినే రాజధానిగా కొనసాగిస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ప్రాంత రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమం 1200 రోజులకు చేరింది. చరిత్రలో కనీవినీ ఎరుగని ఉద్యమమైంది. తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్న ఏకైక నేతగా జగన్‌మోహన్ రెడ్డి గత

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఆయన ఎందుకు వెళ్తున్నారో ఏం పట్టుకువస్తారో ఏం తీసుకెళ్తారో అవేం తెల్వం లేదు బావా!

ఆగని హిందూత్వ మూకల

కవ్వింపులు

ఉత్సవ ఊరేగింపు నెపంతో హింసాకాండ

న్యూఢిల్లీ: మత హింసకు భారతదేశానికి పెద్ద చరిత్ర ఉంది. ఇది 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ప్రారంభమైంది. అన్ని మతపరమైన అల్లర్లకు హిందూ–ముస్లిం వివాదం ఎల్లప్పుడూ కేంద్రంగా ఉంది. మతపరమైన కార్యక్రమాలు జరిగినప్పుడు ఘర్షణలు, అల్లర్లకు దారితీస్తున్న అంశం ఒక్కటే... ఉత్సవ ఊరేగింపుల ముసుగులో హింసాకాండ జరుగుతూనే ఉంది. ఊరేగింపులు సాగే మార్గాలను నిర్వాహకులు ఎంపిక చేసుకొనేదాంట్లోనే అల్లర్లకు దారితీసే... నివారించే అంశం దాగివుంది. ఈ విషయాన్ని 1860లోనే గుర్తించారు. థామస్ మకౌలే ఐపీసీ అమల్లోకి వచ్చింది. సెక్షన్ 153 కింద అల్లర్లు రెచ్చగొడితే ఆరు నెలలు, అల్లర్లకు పాల్పడితే ఏడాది శిక్ష పడుతుంది. సెక్షన్ 188...ప్రభుత్వ అధికారి ఉత్తర్వులను ఉల్లంఘించిన నేరం కింద చర్యలకు అవకాశం కలుగుతుంది.

1984లో ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత సిక్కు సమాజం దురాగతాలకు గురైంది. 2002లో గుజరాత్ అల్లర్లతో ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. 2015లో మొత్తం 884 అల్లర్లు నమోదయ్యాయి, ఆ తర్వాత సంవత్సరంలోనూ హింస పేట్రేగింది. ఈ రెండేళ్లలో వరుసగా 2,428, 2,295 కుల ఘర్షణలు జరిగాయి. 2020లో 167 మత అల్లర్లు, 736 కుల ఘర్షణలు నమోదయ్యాయి. గోరక్షకుల దాడులు, మూకహత్యలు పేట్రేగిపోయాయి. ఈమధ్య లవ్‌జిహాద్ హింస పెరిగింది. అయితే మతపరమైన హింసను కట్టడి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం కావడానికి ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి. ఇటు ఆన్‌లైన్‌లో, అటు వీధుల్లో కొన్ని మూకలు విజృంభిస్తున్నాయి. గణపతి నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో మహారాష్ట్రలో 1927లో, 1966లో

- మిగతా 2 లో

ప్రజలపై మరో పిడుగు

భారీగా ఔషధ ధరల పెంపు

రేపటి నుంచి అమలు

పేదలపై మోదీ సర్కారు మరింత భారం

న్యూఢిల్లీ: అన్ని రకాల నిత్యావసర వస్తువులు, శిలాజ ఇంధనాల ధరలు పెంచిన మోదీ ప్రభుత్వం ప్రజలపై మరో పిడుగువేసింది. పెరిగిన ఆహార వస్తువుల ధరలు, తరిగిన ఆదాయం, నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న సామాన్య జనం ఇకపై మరిన్ని కష్టాలు ఎదుర్కోనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పేద రోగుల నెత్తిన కేంద్రం మరో భారం మోపనుంది. ఇప్పుడున్న ధరలకు తోడు అత్యవసర ఔషధాల ధరలు ఏకంగా 12.12 శాతం పెరగనున్నాయి. గతేడాది ఏప్రిల్ నుండి 10.76 శాతం పెరిగిన ధరలకు తోడు ఈ పన్నెండు నెలల్లో ఔషధాల ధరలు ఏకంగా 24.18 శాతం పెరిగాయి. ఇది ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యకు తోడు నిత్యావసరాలైన ఔషధాల ధరలు, ఆహారవస్తువుల ధరల పెరుగుదలతో పేదల బతుకులు మరింత దుర్భరస్థితికి దిగజారే ప్రమాదం ఏర్పడింది. ఔషధాల

- మిగతా 2 లో

అలుపెరగని పోరు

- 1200 రోజులకు అమరావతి ఉద్యమం
- విపక్షాలు, కోర్టు తీర్పులను లెక్కచేయని వైసీపీ ప్రభుత్వం 2లో
- పరిష్కారాన్ని విస్మరించి జరిలం చేసే కుట్రలు

అమరావతి రైతుల ఉద్యమం చరిత్ర పుటల్లో నిల్చిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వ మూడు రాజధానుల నిర్ణయంతో ప్రారంభమైన అమరావతి ఉద్యమం శుక్రవారానికి 1200 రోజులకు చేరుకుంటుంది.

మే 21న సార్వత్రిక ఎన్నికలు

గ్రీస్ ప్రధాని మిత్సోటకీస్ ప్రకటన

ఏథెన్స్: గ్రీస్ సార్వత్రిక ఎన్నికలు మే 21వ తేదీన జరగనున్నట్లు ఆ దేశ ప్రధాని కిరియాకోస్ మిత్సోటాకిస్ ప్రకటించారు. 'దేశానికి, పౌరులకు స్పష్టత అవసరం. మేము మరింత ధైర్యంగా, రాజీపడకుండా పనిచేస్తాం' అని కేబినెట్ సమావేశం ప్రత్యక్ష ప్రసారంలో ప్రధాని తెలిపారు. న్యూ డెమొక్రసీ విజయం తథ్యమని దీమా వ్యక్తంచేశారు. ఆధునిక సవాళ్లను అధిగమించేందుకు గ్రీక్ మహిళలు, పురుషులకు మే 21న తమ ఓటు హక్కును సద్వినియోగించుకొని సమర్థ పాలకులను ఎన్నుకునే అవకాశం లభిస్తుందని ఆయనన్నారు. దేశంలో చోటుచేసుకున్న ఘోర రైలు ప్రమాదం తర్వాత అధికార పార్టీకి ప్రజాదరణ తగ్గింది. ఈ మేరకు ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడి అయింది. ఫిబ్రవరి 28న రెండు రైళ్లు ఢీకొన్నఘటనలో 57 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలు దుయ్యబట్టారు. దీంతో కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ పార్టీ మద్దతు సన్నగిల్లింది. ఈ పరిణామాలతో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు అధికార పక్షానికి ప్రతిష్ఠాత్మకంగా మారింది.

అమెరికాకు తైవాన్ అధ్యక్షురాలు

తాయ్‌వాన్/బీజింగ్: తైవాన్ అధ్యక్షురాలు త్సాయ్ ఇంగ్ వెన్ అమెరికాకు వెళ్లారు. చైనా ఒత్తిళ్లకు తలొగ్గేదిలేదని, హెచ్చరికల వల్ల మిగతా ప్రపంచానికి దూరంగా ఉండబోమని బుధవారం అమెరికాకు బయల్దేరే ముందు ఇంగ్‌వెన్ స్పష్టంచేశారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య మార్గంలో తైవాన్ వెళుతుందని ఆ దేశ అధ్యక్షురాలు తేల్చిచెప్పారు. ఈ పర్యటనలో భాగంగా అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తితో ఆమె భేటీ అవుతారు. పది రోజుల పర్యటనలో భాగంగా గ్వాటెమాల, బెలిజెల్లోనూ పర్యటిస్తారు. తొలుత న్యూయార్క్‌కు వెళతారని, పర్యటన ముగించే ముందు లాస్ ఏంజిల్స్‌లో పర్యటిస్తారని అధికారులు తెలిపారు. మాక్ మెక్‌కార్తీతో కాలిఫోర్నియాలో భేటీ అవుతారని సమాచారం. ఇదిలావుంటే, త్సాయ్ ఇంగ్‌వెన్ అమెరికా పర్యటనను తైవాన్ వ్యవహారాల కార్యాలయం ప్రతినిధి ఝూ ఫెంగ్లియాన్ ఖండించారు. అమెరికన్ అధికారులతో సమావేశం కూడా అవుతున్నారని, ఇది మరో కవ్వింపు చర్య కాగలదని అన్నారు. ఒకే చైనా సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నారని హెచ్చరించారు. చైనా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతను దెబ్బతీస్తోందని కూడా ఆయన వెల్లడించారు. ఈ పర్యటనను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

పాకిస్తాన్ సీజే అధికారాలకు కత్తెర

కీలక బిల్లుకు పార్లమెంటు ఆమోదం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) అధికారాలను తగ్గించే విధంగా ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదన క్రమంలో పార్లమెంటు కీలక బిల్లును ఆమోదించింది. సీజే అధికారాలకు కత్తెర వేసే విధంగా చట్టాలు చేయకపోతే చరిత్ర మమ్మల్ని క్షమించదు అని షరీఫ్ పార్లమెంటుకు సూచించారు. కాగా, సుమోటో కేసులు, రాజ్యాంగ సంబంధ ధర్మాసనాలపై నిర్ణయాలకు సంబంధించి సీజేకున్న సంపూర్ణ అధికారాలను తగ్గించేందుకు 'ది సుప్రీం కోర్టు (ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్) బిల్లు–2023'కు పార్లమెంటు ఆమోదం లభించింది. ఇకపై ఏదైనా అంశాన్ని సుమోటోగా స్వీకరించే విషయమై ముగ్గురు సీనియర్ న్యాయమూర్తుల కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ఇందులో సీజే ఒక సభ్యుడిగా ఉంటారు. ఇప్పటివరకు ఈ అధికారం సీజే ఒక్కరికే ఉండేది. అలాగే రాజ్యాంగాన్ని వివరించాల్సిన అవసరమున్న కేసుల విచారణకు ధర్మాసనంలో ఐదుగురు లేదా ఎక్కువ ధర్మాసనం ఉండాలన్న నిబంధనను చేర్చారు. ఈ బిల్లును పాకిస్తాన్ కేబినెట్ మంగళవారం ఆమోదించింది.

ఇమ్రాన్‌ఖాన్‌కు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు

ఇస్లామాబాద్: ఓ మహిళా న్యాయమూర్తిని బెదిరించిన కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని, ఈ పాకిస్తాన్ తెహ్రీక్–ఏ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌కు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ అయింది. ఇమ్రాన్ గత ఆగస్టులో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ మహిళా న్యాయమూర్తి జేబా చౌదరిని బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు కేసు నమోదైంది. దీనికి సంబంధించి గతంలోనే కోర్టు ఇమ్రాన్‌కు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ నెల 24న జరిగిన విచారణలో కోర్టు దాన్ని బెయిలబుల్ వారెంటుగా మార్చింది. బుధవారం నాటి విచారణకు ఇమ్రాన్ వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉండగా ఆయన హాజరుకాలేదు. దీంతో కోర్టు ఆయనకు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేసింది. ఏప్రిల్ 18న ఇమ్రాన్‌ను కోర్టులో ప్రవేశపెట్టాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది.

అమరావతి ప్రజలను నట్టేట ముంచిన బీజేపీ, వైసీపీ

సీపీఎం విమర్శ - రైతులు, ప్రజల ఉద్యమానికి మద్దతు

విశాలాంధ్ర–విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కొనసాగిస్తామన్న మాటను నిలబెట్టుకోకుండా అమరావతి ప్రజలను బీజేపీ, వైసీపీ నట్టేట ముంచాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన చేశారు. అమరావతి రైతులు, ప్రజల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఇచ్చిన హామీల అమలును కోరుతూ 1200 రోజులుగా ఉద్యమం సాగిస్తున్న అమరావతి రైతులు, ప్రజలందరికీ సీపీఎం తరఫు అభినందనలు తెలిపారు. ఈ ఉద్యమానికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు రాజధానిగా అమరావతికి మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక వికేంద్రీకరణ సాకుతో మూడు రాజధానులనే వివాదాన్ని సృష్టించారని విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారిందని, ఇందుకు కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్యాకేజీ, పోలవరం తదితర అంశాలలో రాష్ట్రాన్ని కేంద్రం దగా చేసిందని విమర్శించారు. వేలకోట్ల రూపాయల ప్రజాధనంతో అమరావతిలో జరిగే నిర్మాణాలను నిలిపివేసి ప్రజా సొమ్మును వృథా చేశారన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, నిర్దిష్ట కాలపరిమితిలో నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అలుపెరగని పోరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అమరావతి రైతుల ఉద్యమం చరిత్ర పుటల్లో నిల్చిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వ మూడు రాజధానుల నిర్ణయంతో ప్రారంభమైన అమరావతి ఉద్యమం శుక్రవారానికి 1200 రోజులకు చేరుకుంటుంది. ఈ ఉద్యమ ప్రస్థానంలో రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వందలాది మంది రైతులు అశువులు బాశారు. ప్రభుత్వం కక్షపూరితంగా బనాయించిన అక్రమ కేసుల్లో వేలాది మంది రైతులు గత నాలుగు సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఈ 1200 రోజుల ఉద్యమ ప్రస్థానంలో ఏ ఒక్కరోజూ సమస్య పరిష్కారానికి ప్రయత్నించిన దాఖలాలులేవు. పైగా సమస్యను ఎప్పటికప్పుడు జఠిలం చేసే ప్రయత్నాలు, కుట్రలకు పాల్పడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోకూడదని, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్ కోసం ఉచితంగా అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల త్యాగాలను వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం గుర్తించకపోగా, వారిని వంచనకు గురిచేసింది. గత ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో వారంతా భూములిచ్చినందున, వారందరినీ టీడీపీ శ్రేణులుగానే సీఎం జగన్ భావిస్తున్నారు. విచిత్రమేమిటంటే రాజధాని ప్రాంతంలో వైసీపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఈసడించుకొంటున్నారు. ఎలాగైనా అమరావతిని విధ్వంసం చేయాలన్న లక్ష్యంతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజు నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటివరకు శరవేగంగా సాగుతున్న రాజధాని నిర్మాణపనులన్నింటినీ రివర్స్ టెండరింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చి నిలిపివేశారు. ఆ తర్వాత 2019 డిసెంబరు 17వ తేదీ అసెంబ్లీలో మూడు రాజధానుల ఏర్పాటుపై సీఎం జగన్ ప్రకటన చేశారు. ఆ రోజు నుంచి రైతులు రోడ్డెక్కాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. అమరావతి రాజధానిని రక్షించుకోవడం కోసం ప్రారంభించిన రైతుల ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడింది. వేలాదిమంది రైతులపై అక్రమ కేసులు బనాయించింది. మహిళలు, వృద్ధులని కూడా చూడకుండా, చివరకు ఎస్సీ రైతులపైనే అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసింది. పోలీసులను ప్రయోగించి ఆందోళనకారులను భయభ్రాంతులకు గురిచేసేలా అరాచకాలు సృష్టించింది. అడుగడుగునా రైతుల ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. మరోవైపు అమరావతిపై అనేక విధాలుగా వైసీపీ పాలక పెద్దలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాజధాని భూముల యజమానులంతా చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారని, అది అమరావతి కాదు..కమ్మరావతి అని, రాజధాని పేరుతో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, ఇదో పెద్ద భారీ కుంభకోణమని విస్తృత ప్రచారం చేశారు. లక్షల కోట్లు అమరావతిలో ఖర్చు పెట్టడం వల్ల అభివృద్ధి కేంద్రీకృతమవుతుందని, ఇదంతా ముంపు ప్రాంతమని, నిర్మాణాలకు భారీ ఖర్చు అవుతుందని, ఇదో శ్మశానం అంటూ రకరకాలుగా దుష్ప్రచారం చేశారు. అందుకే భవిష్యత్తులో తెలంగాణ తరహా ఉద్యమాలు తలెత్తకుండా మూడు రాజధానుల నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నించారు. రాజధాని రైతులు మాత్రం ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, దౌర్జన్యాలకు పాల్పడినా, కుయుక్తులు పన్నుతున్నా వెనకడుగు వేయకుండా, ప్రభుత్వ దమనకాండను సమర్థంగా తిప్పికొడుతూ శాంతియుత మార్గంలో అలుపెరగని పోరాటం కొనసాగిస్తున్నారు. వీరికి విపక్షాలన్నీ అండగా నిలబడుతున్నాయి. బీజేపీ మాత్రం అమరావతికి మద్దతు అంటూనే కేంద్రస్థాయిలో పట్టించుకోకుండా డ్రామాలాడుతోంది. విభజన చట్టం ప్రకారం ఏర్పడిన అమరావతి రాజధానిని మార్చడానికి వీల్లేదని, సీఆర్డీఏ చట్టం ప్రకారం భూమిలిచ్చిన రైతులకు ప్రభుత్వ అగ్రిమెంటు ప్రకారం రాజధాని ప్లాన్ అమలు చేసి తీరాల్సిందేనని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. ఆరు నెలల్లో రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని, రైతులిచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా కోర్టు ఆదేశాల ధిక్కరణ తప్పించుకోవడానికి హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు చివరిరోజు అప్పీలుకు వెళ్లింది. అక్కడ కూడా ఈ కేసును త్వరగా విచారించాలని సుప్రీంను అభ్యర్థిస్తోంది. దీనిపై కోర్టులో ఏదో ఒకటి తేలిన తర్వాత వచ్చే ఎన్నికల్లోగా కనీసం సీఎం క్యాంపు కార్యాలయమైనా విశాఖలో ఏర్పాటు చేసుకుని తన పంతం నెగ్గించుకోవాలన్న ఆలోచనతో వైసీపీ ప్రభుత్వం ఉంది.

మందడంలో నేడు జేఏసీ ప్రత్యేక కార్యక్రమాలు

అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగిస్తూ అభివృద్ధి చేయాలనే డిమాండ్‌తో రాజధాని ఉద్యమం 1200 రోజుకు చేరిన సందర్భంగా శుక్రవారం ' రాష్ట్ర అభివృద్ధి కోసం దగా పడిన రైతులు, పోరాడి గురవుతున్న ఆంధ్రా పౌరులు, అమరావతికి అండగా 13వేల గ్రామాల నీరు–మట్టి–సంఘటనలు' అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని మందడం శిబిరంలో నిర్వహిస్తున్నట్లు ఐక్యకార్యాచరణ సమితి వెల్లడించింది. రాజధాని నిర్మాణం అవసరాన్ని ప్రభుత్వానికి, ప్రజలకు తెలియచెయ్యడమే కార్యక్రమ ఉద్దేశంగా జేఏసీ పేర్కొంది. ఈ కార్యక్రమానికి వైసీపీ మినహా అన్ని పార్టీల రాష్ట్ర నేతలను జేఏసీ ఆహ్వానించింది.

సగానికి తగ్గిన ఐపీఓలు

ముంబై: మార్చి 31తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ సంవత్సరంలో ఐపీఓల జోరు కూడా తగ్గింది. 2021–22తో పోలిస్తే ఈ ఏడాది విలువపరంగా పబ్లిక్ ఇష్యూలు సగానికి పడిపోయాయి. గతేడాది 53 కంపెనీల షేర్లు మార్కెట్‌లో కొత్తగా నమోదయ్యాయి. ఈసారి ఆ సంఖ్య 37కు పరిమితమైనట్లు గణాంకాలు వెల్లడించాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చాలా కంపెనీలు ఐపీఓకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 54 కంపెనీలకు సెబీ అనుమతి పొంది ఉన్నాయి. ఇవన్నీ కలిసి రూ.76,189 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. మరో రూ.32,940 కోట్ల సమీకరణకు 19 కంపెనీలు సెబీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే '22 ఆర్థిక సంవత్సరంలో వివిధ కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1,11,547కోట్లు సమకూర్చుకున్నాయి. 2022–23లో ఆ విలువ రూ.52,116 కోట్లకు పడిపోయింది. పైగా దీంట్లో ఒక్క ఎల్ఐసీ ఐపీఓ ద్వారానే రూ.20,557 కోట్లు సమకూరాయి. ఏడాది మొత్తంలో ఐపీఓ ద్వారా వచ్చిన నిధుల్లో ఇది 39 శాతానికి సమానం. ఎల్ఐసీని మినహాయిస్తే ఐపీఓల ద్వారా కంపెనీలు సమకూర్చుకున్న మొత్తం రూ.31,559 కోట్లకు పరిమితమై ఉండేది. మొత్తంగా '22 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఈక్విటీ నిధుల సమీకరణ ద్వారా రూ.76,076 కోట్లు సమకూరాయి. క్రితం ఏడాది వచ్చిన రూ.1,73,728 కోట్లతో పోలిస్తే ఈసారి 56 శాతం క్షీణత నమోదైంది. ఎస్ఎంఈ ఇష్యూలు కూడా కలిపితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఐపీఓల ద్వారా రూ.54,344 కోట్లు సమకూరాయి. దీంట్లో క్యాపిటల్ మార్కెట్ల ద్వారా రూ.85,021 కోట్లు వచ్చాయి. దీంట్లో ఆఫర్ ఫర్ సేల్ కింద రూ.11,231 కోట్లు, క్యూఐపీల ద్వారా రూ.8,169 కోట్లు, రీట్స్/ఇన్విట్ల ద్వారా రూ.1,166 కోట్లు సమకూరాయి. మరోవైపు పబ్లిక్ బాండ్ల ద్వారా కంపెనీలు మరో రూ.8,944 కోట్లు రాబట్టుకున్నాయి. ఇలా ఐపీఓ, బాండ్లు కలిపి మొత్తంగా ఈ ఏడాదిలో వివిధ సంస్థలు రూ.85,021 కోట్లను సమకూర్చుకున్నాయి. గతేడాది ఈ మొత్తం రూ.1,85,438 కోట్లుగా నమోదైంది. కొత్తతరం సాంకేతిక కంపెనీల వెనక్కి: ఈ ఆర్థిక సంవత్సరం అతిపెద్ద ఐపీఓ జాబితాలో ఎల్ఐసీ (రూ.రూ.20,557 కోట్లు), డెలివరీ (రూ.5,235 కోట్లు), గ్లోబల్ హెల్త్ (రూ.2,206 కోట్లు) ఉన్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన మొత్తం 37 పబ్లిక్ ఇష్యూల్లో 25 మే, నవంబర్, డిసెంబరు నెలల్లోనే రావడం గమనార్హం. నాలుగో త్రైమాసికంలో ఐపీఓల సంఖ్య తొమ్మిదేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. మొత్తం 37 ఐపీఓల్లో కేవలం రెండు మాత్రమే కొత్తతరం సాంకేతిక కంపెనీలు. క్రితం ఏడాది ఈ రంగంలో ఐదు కంపెనీలు రూ.41,733 కోట్లు సమకూర్చుకున్నాయి.ఐపీఓలపై ఈ ఏడాది ప్రజల ఆసక్తి సైతం తగ్గింది. 11 ఇష్యూలకు మాత్రమే 10 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం సైతం గణనీయంగా పడిపోయింది. క్రితం ఏడాది రిటైల్ మదుపర్ల నుంచి సగటున 13.32 లక్షల దరఖాస్తులు రాగా.. ఈసారి అది 5.64 లక్షలకు తగ్గింది.

నా పిటిషన్‌పైనా రాహుల్‌కు శిక్ష !

సుశీల్ మోదీ ఆశాభావం

పాట్నా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తాను దాఖలు చేసిన పిటిషన్‌పైనా ఆయనకు శిక్ష పడుతుందని ఆశిస్తున్నట్లు బీజేపీ ఎంపీ సుశీల్ మోదీ అన్నారు. 2019లో కర్ణాటకలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఇటీవల సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించగా.. తాను దాఖలు చేసిన పిటిషన్‌పై పట్నాలోని ఎంపీ/ఎమ్మెల్యే న్యాయస్థానం వచ్చేనెల రాహుల్‌ను విచారణకు పిలిపించిందని తెలిపారు. 'పాట్నాలోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు ఏప్రిల్ 12న వ్యక్తిగతంగా హాజరుకావాలని రాహుల్‌ను ఆదేశించింది. 2019 ఎన్నికల సమయంలో కర్ణాటకలో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నా పిటిషన్‌పై విచారణ జరుగుతుంది. సీఆర్‌పీసీ సెక్షన్ 317 ప్రకారం రాహుల్‌గాంధీ వాంగ్మూలం రికార్డు చేసేందుకు కోర్టు సమన్లు ఇచ్చింది. సూరత్ కోర్టులో లాగే ఇక్కడ న్యాయస్థానం సైతం రాహుల్‌ని దోషిగా తేల్చి తగిన శిక్ష విధిస్తుందన్న విశ్వాసం ఉంది. రాహుల్ గాంధీ, ఆయన పార్టీ వారసత్వ రాజకీయాలను విశ్వసిస్తాయి. మోదీ లాంటి ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి ప్రధాని సీట్లో కూర్చోవడాన్ని వారు భరించలేరు. అందుకే నిత్యం దూషిస్తుంటారు. ఈ ధోరణిని న్యాయవ్యవస్థ మాత్రమే సమర్థంగా నిరోధించగలదు' అని సుశీల్ మోదీ వ్యాఖ్యానించారు.

అమిత్‌షాతో జగన్ రహస్య ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

మొత్తాన్ని కర్ణాటక ఎన్నికల్లో ఖర్చు చేయబోతున్నారన్నారు. బీజేపీతో చేసుకున్న ఒప్పందం కారణంగా వివేకానందరెడ్డి హత్య కేసు తీర్పు ఆలస్యం కాబోతుందని ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఎందుకివ్వడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నారాయణ ప్రశ్నించారు. నిర్వాసితుల సమస్యపై కేంద్రాన్ని జగన్ నిలదీయాలని, నిర్వాసితులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన పోలవరంను సాధారణ ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. బీజేపీపై రాజకీయ ఉద్యమం అవసరమని, అందుకే దేశ్ కా బచావో–మోదీ హటావో నినాదంతో ప్రజాచైతన్య కార్యక్రమాలకు సిద్ధమవుతున్నామని నారాయణ చెప్పారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.జయలక్ష్మి, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా పాల్గొన్నారు.

సీఎం జగన్ మంకుపట్టు వీడాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టారు. అధికారంలోకి రాగానే మాట మార్చి, మడం తిప్పి, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. అమరావతినే రాజధానిగా అభివృద్ధిచరచాలని హైకోర్టు చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లెక్కచేయకుండా సుప్రీంకోర్టు కెక్కింది. సుప్రీంకోర్టు కూడా జగన్ సర్కారుకు అనుకూలంగా స్టే ఇవ్వలేదు. ఉగాది నుంచి విశాఖ నుంచి పాలన సాగిస్తామన్న జగన్‌కు ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖలో చుక్కెదురైంది. వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఘోర పరాజయం చెందారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి అమరావతినే రాజధానిగా కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని ఆ ప్రకటనలో రామకృష్ణ డిమాండ్ చేశారు. 1200 రోజుల పూర్తయిన అమరావతి ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు మార్చి 31న రైతులు నిర్వహించే కార్యక్రమాల్లో సీపీఐ భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు.

ప్రజలపై మరో పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

ధరలలో పెంపుదలను జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల సంస్థ(ఎన్‌పీపీఏ) అనుమతించడంతో కోట్లాదిమంది పేద రోగులపై మరింతభారం పడనుంది. ఔషధ ధరలను 2017లో 1.97 శాతం, 2018లో 3.43 శాతం, 2019లో 4.26 శాతం, 2020లో 1.88 శాతం మాత్రమే పెంచేందుకు అనుమతిస్తూ అప్పుడు మాత్రం భారీగా పెంచడానికి సిద్ధమైంది. 2021లో 10 శాతానికిపైగా పెరిగాయి. అత్యవసర ఔషధాల ధరలను 10 శాతానికి మించి పెంచడం వరుసగా ఇది మూడో సంవత్సరం. 2022 ఏప్రిల్ 1 నుండి ఔషధాల ధరల పెరుగుదల 36.60 శాతం కంటే ఎక్కువగా నమోదైంది. మరోపక్క మందుల తయారీ కంపెనీలు అధిక లాభాలు ఆర్జిస్తున్నాయి.

పెయిన్ కిల్లర్స్, యాంటీ ఇన్ఫెక్టివ్‌లు, గుండె సంబంధిత మందులు, యాంటీ బయోటిక్స్ వంటి మందుల ధరలు పెరుగనున్నాయి. 384 మాలిక్యూల్స్ ధరలను పెంచడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. ఈ లిస్టెడ్ మందుల జాబితాలో జ్వరం, ఇన్ఫెక్షన్, గుండె జబ్బులు, రక్తపోటు, చర్మ వ్యాధులు, రక్తహీనత వంటి వాటి చికిత్సకు ఉపయోగించే మందుల ధరలు భారీగా పెరగనున్నాయి. జాతీయ ధరల నియంత్రణ యంత్రాంగం పరిధికి వెలుపల ఉన్న నాన్–షెడ్యూల్డ్ ఔషధాలకు ప్రతి సంవత్సరం 10 శాతం వార్షిక పెరుగుదలకు అనుమతిస్తారు. ఈ మందులు ఇప్పటికే పేదలకు అందుబాటులోలేవు. ఎందుకంటే వాటి ధర చాలా ఎక్కువగా ఉండటంతో సాధారణ ప్రజలకు కొనుగోలు చేసే స్తోమతలేదు. ధరలు పెంచేందుకు అనుమతించాలన్న ఎన్‌పీపీఏ నిర్ణయాన్ని ఔషధ తయారీ సంస్థలు స్వాగతిస్తున్నాయి. డ్రగ్స్ తయారీలో ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో తక్షణమే ధరలను 10 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. అన్ని ముడి పదార్థాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ పదార్థాలు, ప్లాస్టిక్, ప్యాకేజింగ్ మెటీరియల్ ధరలు, సరుకు రవాణా ఖర్చులు, ఉత్పత్తితోపాటు సరఫరా ఖర్చులు పెరగడంతో ధరలు పెంచాలని సూచిస్తున్నాయి.

ఔషధాల ధరలను ఎన్‌పీపీఏ ఏటా నిర్ణయిస్తుంది. ధరల పెంపునకు అనుమతిస్తే మార్కెట్‌లో మందుల కొరత ఉండదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. పేద రోగులను రక్షించేందుకు కేంద్రం నిర్దిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసి ఉంది. పేద రోగులకు అవసరమైన మందులను ఉచితంగా లేదా సరసమైన ధరలకు ప్రభుత్వం సరఫరా చేయాలి. మార్కెట్‌లో నకిలీ, నాసిరకం మందుల నుండి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నకిలీమందుల తయారీపై 18 ఔషధ కంపెనీల లైసెన్సులను రద్దుచేస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని 20 రాష్ట్రాల్లో 76 కంపెనీలపై డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీజీసీఐ) తనిఖీల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా హిమాచల్‌ప్రదేశ్‌లో 70, ఉత్తరాఖండ్‌లో 45, మధ్యప్రదేశ్‌లో 23 కంపెనీలు నకిలీ డ్రగ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించి, వాటిపై తగిన చర్యలు చేపట్టింది. అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టే ఇటువంటి చర్యలపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

నకిలీ, నాసిరకం మందుల ఉత్పత్తిని తక్షణమే ఆపడానికి షోకాజ్ నోటీసు వంటి చర్యలు సరిపోవు. స్పెసిఫికేషన్‌లు, ఔషధాల పరిమాణాన్ని తారుమారు చేయడం సహా అనేక మార్గాల ద్వారా అధిక లాభాలతో ఔషధాలు విక్రయించడం, ఔషధ తయారీదారుల దురాశ కూడా కేంద్రం కళ్లెం వేయాలి. అన్ని మందులు, వైద్య పరికరాలపై 10 శాతం నుంచి 800 శాతం లాభ మార్జిన్ వేసుకుంటున్న అన్యాయమైన ధరల నుండి ప్రజలను రక్షించవలసిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ధరల నియంత్రణ విధానాన్ని తీసుకురావడం ప్రభుత్వ కర్తవ్యం.

ఆగని హింధుత్వ మూకల కవ్వింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఘర్షణలు జరిగాయి. 1925లోనూ ఇలాంటి అల్లర్లు జరిగాయి. 1967లో మహారాష్ట్రలోని షోలాపూర్ నగరంలో హింస జరిగింది.

75 ఏళ్లుగా దేశంలో చెలరేగిన విధ్వంసకర మత హింసలో కొన్ని ప్రస్తావనార్హం.

1970లో భివండి, జలగావ్, మహద్‌లో హింసకు దారితీసిన మతఘర్షణలు విషాదాన్ని మిగిల్చాయి. భివండిలో 78 మంది ప్రాణాలు కోల్పోగా ఇందులో 59 మంది ముస్లింలు ఉన్నారు. జలగావ్, మహద్ నగరాల్లోనూ అదే తరహా హింస చోటుచేసుకోగా 43 మంది చనిపోయారు. వీరంతా ముస్లింలే కావడం గమనార్హం. 1963 వత్సరం భివండి చరిత్రలో కీలకం. అదే ఏట ఊరేగింపుల పరంపర మొదలైంది. మసీదుల మీదుగా సాగే సమయంలో ఘర్షణలు జరిగాయి. 1964లో శివజయంతి ఊరేగింపులో భాగంగా మసీదుల ఎదుట ఆగి ముస్లింలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, వారిని రెచ్చగొట్టడం, గులాబీ రంగు చల్లడం వంటివి చేసేవారు. ఈ మేరకు జస్టిస్ మాదన్ గుమనానికి వచ్చింది. అదే సంవత్సరంలో భారతీయ జనసంఘ్... బీజేపీ మాతృసంస్థ భివండి శాఖ మొదలుపెట్టింది. 1965లో ఊరేగింపుల ద్వారా కవ్వింపులు ఎక్కువయ్యాయి. 1967లో భివండి మొదటి మతఘర్షణ జరిగింది. శివజయంతి ఊరేగింపు నిజాంపూరా జుమ్మా మసీదు మీదుగా సాగే సమయంలో జరిగిన పరిణామాలు అల్లర్లకు దారితీశాయి. 1969లో శివజయంతి ఉత్సవ్ సమితి నిర్వీర్యమైంది. 15 మంది జనసేన సభ్యులతో పాటు ఓ శివసేన సభ్యుడు బయటకు వెళ్లడంతో ఆ సంస్థ ఆగిపోయింది.

1979లో జంషెడ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్/వీహెచ్‌పీ ఒత్తిడి మేరకు కొత్త మార్గంలో అంటే ముస్లిం ప్రాంతమైన సబీర్‌నగర్ మీదుగా రామనవమి ఊరేగింపు తీయాలని నిర్ణయించారు. అల్లర్లు జరుగుతాయని మార్గాన్ని మార్చుకోవాలని అధికారులు కోరినా నిర్వాహకులు ససేమిరా అన్నారు. అయితే అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్ఎస్ఎస్/వీహెచ్‌పీ ఆందోళనకు దిగి చివరకు యంత్రాంగంపై ఒత్తిడి పెంచడంతో ఆ ఏడాది మొత్తం ఊరేగింపు నిర్వహించలేదు. అలాంటి సమయంలో కర్పూరీ ఠాకూర్ నేతృత్వ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటవడంతో రామనవమి ఊరేగింపు సబీర్‌నగర్ నుండి సాగేందుకు అనుమతి లభించింది. నిర్ణయమనూనా ఊరేగింపు మాత్రమే వెళ్లాలని ఆదేశం ఉండగా, అందులో స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొనలేదు, సామన్య మార్గాల్లోనే ప్రధాన ఊరేగింపు సాగాలన్న ఒప్పందం మీద అనుమతి లభించింది. కానీ 15వేల మందితో కూడిన ప్రధాన ఊరేగింపు ఒక్కసారిగా మార్గాన్ని మార్చేసి 'సమూనా' ఊరేగింపును అనుసరించి సబీర్‌నగర్ మసీదు వద్ద బీజేపీ ఎమ్మెల్యే దీనానాథ్ పాండే ఆధ్వర్యంలో ముస్లిం వ్యతిరేక నినాదాలు, ప్రసంగాలు రెచ్చగొట్టడంతో అల్లర్లు చెలరేగాయి. 108 మంది చనిపోగా అందులో 79 మంది ముస్లింలు, 25 మంది హిందువులు ఉన్నారు. పెద్ద ఎత్తున ఆస్తినష్టం కూడా జరిగింది. సబీర్‌నగర్ అల్లర్ల కేంద్రంగా మారి అక్కడి ముస్లింలు తమ జీవితాలను, జీవనోపాధిని కోల్పోయారు.

1989 కోటలో...1947 నుండి ఎన్నడూ అల్లర్లను చూడని రాజస్థానీ నగరం కోట. అక్కడ 1989లో లక్షిత అల్లర్లు–హింస చెలరేగింది. రాజస్థాన్‌లోని ఈ ప్రాంతంలో అనంత్ చతుర్దశి ఊరేగింపు నిర్వహించారు. గణపతి విసర్జనాన్ని వాడుకొని మతచిచ్చు రగల్చారు. 1989, సెప్టెంబరు 15న ముస్లిం మొహల్లా గుండా ఊరేగింపు తీసి అక్కడి పెద్ద మసీదు ఎదుట ఆగి పెద్దపెట్టున మతపరమైన నినాదాలు చేయడమే కాకుండా ముస్లింలను దూషించారు. దీంతో అక్కడి ముస్లింలు ప్రతిఘటించారు. ఫలితంగా రాళ్లదాడులు, మారణహోమం జరిగింది. 20 మంది మృతి చెందగా అందులో 16 మంది ముస్లింలు ఉన్నారు. వేలాది మంది ముస్లిం వీధివ్యాపారులు, వర్తకులు ఘోరంగా నష్టపోయారు. ముస్లింల ఇళ్లు, దుకాణాలను హింధుత్వ మూకలు దగ్ధం చేశాయి.

1989, భాగల్పూర్‌లో... ఆ ఏడాది అక్టోబరు 24న స్థానిక ముస్లింలు ఎక్కువగా నివాసం ఉండే తాతర్‌పూర్‌లో రాముడి శిలను ఊరేగించారు. అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత అక్కడ రామాలయం నిర్మాణంలో దీనిని వినియోగిస్తారని అప్పట్లో ప్రచారం ఉంది. (1992లో బాబ్రీ మసీదు విధ్వంసకాండ చోటుచేసుకుంది) వేలాది మందితో ఊరేగింపుకు పోలీసులు అనుమతిచ్చారు. తాతర్‌పూర్‌లోకి ఊరేగింపు ప్రవేశించిన తర్వాత జరిగిన పరిణామాలతో నిరాయుధ ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. ఆ ఊచకోత పరిణమించింది. తీవ్ర గాయాలతో రక్తం మడుగులో చేతులకు బేడీలతో 900 శవాలు దీనస్థితిలో లభ్యమయ్యాయి. ఏదాదిపైగా ఈ అల్లర్లకు వ్యూహరచన జరిగినట్లు దర్యాప్తు కమిషన్ తేల్చింది.

2022లో జరిగిన హనుమాన్ జయంతి ఊరేగింపుల్లో

మారణాయుధాలు, కర్రలతో పగలేంత డీజే సౌండ్ హోరు, మసీదుల వద్ద విద్వేష సాహిత్యం, రెచ్చగొట్టే చర్యలు, కవ్వింపులకు ముస్లింలు స్పందించగా అది అల్లర్లకు దారితీసింది. ఏదిఏమైనా ఇన్నేళ్లలో వచ్చిన మార్పు ఒక్కటే.. గతంలో ఇలాంటివి జరిగినప్పుడు ప్రభుత్వాలు, పాలకులు చింతన వ్యక్తంచేసేవారు. దర్యాప్తు కమిషన్లు ఏర్పాటు చేసేవారు, బాధితులకు పరిహారం ఇచ్చేవారు కాని నేటి పాలకులు హింసను సమర్థిస్తున్నారు. మూకలను వెనకేసుకొస్తున్నారు. దర్యాప్తు కమిషన్లకు బదులు బుల్డోజర్లతో విధ్వంసానికి ఆదేశాలిస్తున్నారు. నిష్పాక్ష సైనాటీ వర్గంపై అధికార దమనకాండకు పోలీసులు మద్దతివ్వడం. ప్రజా రక్షణ తమ విధిధర్మమని మర్చి పాలకులకు దాసోహమై అక్రమ నిర్బంధాలుగా మైనారిటీలపై అధికారం దురాగతాలను కప్పిపుచ్చడానికి పరిమితమయ్యారు.

దళితులపై అడుగడుగునా వివక్ష

ప్రజాప్రతినిధుల రాజీతో అన్యాయం

జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ

విశాలాంధ్ర-విశాఖ: ప్రభుత్వాల ఆలోచనా విధానంలో మార్పు రానంత వరకూ ఎన్ని కఠినచట్టాలు ఉన్నా దళితులపై వివక్ష ఆగదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అభిప్రాయపడ్డారు.

కేరళలో అంటరానివారు దేవాలయ ప్రవేశం కోసం ఏడాదిన్నర సాగిన ఉద్యమానికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా 'కుల నిర్మూలన జరుగుతుందా ఈ దేశంలో' (అవరోధాలు-అవకాశాలు) అంశంపై విశాఖలో గురువారం డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, ఏఎంఎస్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అందుకే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై నిరంతరం దాడులు కొనసాగుతున్నాయని జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో సివిల్స్‌కి సన్నద్ధమవుతున్న దళిత యువకులపై దాడి జరిగిందని, ఇక్కడ వైసీపీ పాలనలోనూ దళితులకు ఎటువంటి న్యాయం జరగడం లేదన్నారు. రాజమండ్రిలో ఇసుక మాఫియాకు ఎదురుతిరిగిన దళిత యువకుడికి సబ్‌ఇన్‌స్పెక్టర్ శిరోముండనం చేయించాడని, దీనిపై రాష్ట్రపతికి విన్నవించినా న్యాయం జరగలేదని గుర్తుచేశారు. దళితులపై దాడులు జరిగితే పాలక పక్షానికి చెందిన దళిత ప్రజాప్రతినిధులు రాజీప్రయత్నాలు చేస్తున్నారని, దళితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించడం లేదని విమర్శించారు. దళిత శాసనసభ్యురాలు ఉండవల్లి శ్రీదేవి ఇంటిపై దాడి జరిగితే...తన ఇంటిపై తానే దాడి చేయించుకుందని దళిత ప్రజాప్రతినిధులు ఆమెనే విమర్శించడాన్ని తప్పుబట్టారు. హత్యలు జరిగిన సమయంలో దళితుల ప్రాణాలకు డబ్బుతో విలువ కట్టి రాజీ చేసే దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిగా ఖర్చుపెట్టడం లేదన్నారు. గతంలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు కాకపోతే తరువాత సంవత్సరానికి బదలాయించేవారని, ఈ పద్ధతి మార్చడం వల్ల నిధులు వెనక్కి వెళ్లిపోతున్నాయని వివరించారు. సబ్‌ప్లాన్ నిధుల్లో ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం 72 శాతం మాత్రమే ఖర్చు చేసిందని, 28 శాతం నిధులు మురిగిపోయాయని చెప్పారు. దళిత సంఘాలు ఐక్యంగా ఉండి వివక్షపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సత్యపాల్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, సీపీఎం రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఏఎంఎస్ చైర్మన్ బి.కల్యాణరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో చోరీ

105 కిలోల వెండి, రూ.2.15 లక్షలు మాయం

విశాలాంధ్ర-కర్నూలు క్రైమ్: దొంగలను బంధించే పోలీసు స్టేషన్‌లోనే చోరీ జరగడం కర్నూలు తాలూకాలో కలకలం రేపింది. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి 105 కిలోల వెండితో పాటు రూ.2.15లక్షల నగదును దొంగలు దోచుకుపోయారు. 2021లో పంచలింగాల చెక్‌పోస్ట్ వద్ద బిల్లులు లేకుండా తరలిస్తున్న 105 కిలోల వెండిని, రూ.2,15,000 నగదును సీజ్ చేసిన పోలీసులు, వాటిని సెబ్, తాలూకా పోలీస్ స్టేషన్లో ఉంచారు. ప్రస్తుతం వెండి ధర ఎక్కువగా ఉండటంతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆ వ్యాపారి జరిమానాను కోర్టులో చెల్లించి వెండిని తీసుకెళ్దామని భావించారు. ఇదే విషయమై నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నారు. కానీ తాజా పరిణామంతో ఖంగుతిన్నారు. ఇప్పటివరకు ఈ పోలీసు స్టేషన్‌కు ముగ్గురు సీఐలు మారారు. ఎవరున్నప్పుడు చోరీ జరిగిందో పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు. పూర్తిస్థాయి విచారణతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, బాధితుడికి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ అన్నారు.

దొడ్డిదారిన భారాలు తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటుచార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం మోసపూరితమని, తక్షణమే వసూళ్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెల విద్యుత్ యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు (ట్రూఅప్) వసూలు చేయటాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలకు పెంచి 1400 కోట్ల రూపాయల భారం మోపిందనీ, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారనీ, దీని వలన 2900 కోట్ల రూపాయల భారం పడిందని తెలిపారు. 2020- 21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65 పైసలు వరకు 2023 ఏప్రిల్ నుంచి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పేరుతో 3083 కోట్ల రూపాయల భారం వినియోగదారులపై పడనున్నది. అదాని తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు చార్జీల పేరుతో దండుకుంటున్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాట తప్పి ఈ రీతిలో భారాలు మోపటం అన్యాయమన్నారు. ప్రభుత్వం బలవంతంగా వేస్తున్న ఈ విద్యుత్ భారాలను ప్రజలు ప్రతిఘటించాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

వైభవంగా సీతారామ కల్యాణం

విశాలాంధ్ర-భద్రాచలం: భద్రాచలంలో సీతారాముల కల్యాణం గురువారం వైభవోపేతంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభితమైన మండపంలో అశేష భక్తజన కోటి జయ జయ ధ్వానాల నడుమ సాంప్రదాయంగా కల్యాణ వేడుకను రిత్వికులు జరిపించారు. రామ చంద్రుడు సీతమ్మ తల్లిని పరిణయమాడిన ఘట్టాన్ని తిలకించిన భక్తజనం తన్వయత్వంతో పులకించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్త జనులు సీతారాముల కల్యాణ వైభోగాన్ని కనులారా చూసి పులకించి పోయారు. భక్తజన కోటితో గోదావరి తీరం సందడిగా మారింది. గురువారం తెల్లవారు జామునే భక్తులు పావన గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కుబడులు చెల్లించుకుని సీతారామ చంద్రులను దర్శించుకుని, కళ్యాణ మండపానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించిన ప్రముఖుల్లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిన్న జియర్ స్వామి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి తదితరులు ఉన్నారు.

నేడు పుష్కర పట్టాభిషేకం

భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్కర పట్టాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళసై హాజరు కానున్నారు.

సోషల్‌మీడియాలో విద్వేష పోస్టులు

సైబర్ నేరం కింద అంజన్ అరెస్టు

విశాలాంధ్ర- గన్నవరం: సోషల్ మీడియాలో ప్రముఖ వ్యక్తులపై విద్వేషపూరిత పోస్టులు పెడుతూ వివిధ రాజకీయ, సామాజిక పక్షాల మధ్య విద్వేషాలను పురికొల్పే విధంగా ప్రవర్తిస్తున్న అంజన్ అనే వ్యక్తి సైబర్ నేరం కింద కృష్ణాజిల్లా గన్నవరం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రాష్ట్రంలో సంచలనం కలిగిస్తున్న ఈ ఘటనపై డీఎస్పీ గురువారం విలేకర్లతో మాట్లాడుతూ గన్నవరం ఇన్‌స్పెక్టర్ కనకారావుకు అందిన ఫిర్యాదు మేరకు గన్నవరం రామానగర్ ప్రాంతానికి చెందిన పొందూరు అంజన్ అలియాస్ అంజన్ చౌదరి అను వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 'అంజన్ యువగళం' అను అకౌంట్ ద్వారా ప్రముఖ వ్యక్తుల పైన విద్వేషపూరిత పోస్టులు పెడుతూ, ప్రజా ప్రతినిధులపై ద్వేషం, అసత్యాలతో కూడిన సందేశాలను పోస్ట్ చేయడం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. అంజన్ నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్, ట్యాబ్ తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని తెలిపారు. నిందితుడి తల్లిదండ్రులు గౌరవప్రదమైన ఉద్యోగాలు చేసి పదవి విరమణ చేసి ఉన్నారు. అంజన్ వయసు 34 సంవత్సరాలు. అమెరికాలో టార్గెట్ కార్పొరేషన్ కంపెనీలో 3 సంవత్సరాలు ఉద్యోగం చేసి 2015 లో భారత్‌కు తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టుల ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నాడు. మద్యానానికి బానిసై తరచుగా తల్లిదండ్రులను హింసించే వాడు. చెడు వ్యసనాలకు డబ్బు కోసం ప్రతి రోజూ తల్లిదండ్రులను, స్నేహితులను పీడిస్తూ ఉండేవాడు. అంజన్ ఫోన్, టాబ్‌లో ఉన్న వందలకొద్ది గే వీడియోలనుచూసి పోలీసులే విస్తు పోయారు. టిండర్ క్రెడిట్, క్యూపిడ్, గ్రిండర్, క్లబ్ హౌస్ మొదలగు డేటింగ్ యాప్‌ల ద్వారా గే (పురుష స్వలింగ సంపర్కులతో) సంబంధాలు నడుపుతూ తరచూ వారితో నగ్న వీడియో కాల్స్, అసంబద్ధ లైంగిక సంబంధాలకు అలవాటు పడ్డాడని తెలిపారు.

నేడు మన్యం బంద్

భారీగా బలగాల మోహరింపు

విశాలాంధ్ర బ్యూరో-ఏఎస్ఆర్ జిల్లా: బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాల ఐక్యవేదిక శుక్రవారం మన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. ఎట్టిపరిస్థితుల్లోనూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా...నిర్బంధాలకు పాల్పడినా బంద్‌ను జయప్రదం చేసి తీరతామని స్పష్టంచేసింది. బంద్‌లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చింది. మరోవైపు బంద్‌ను విఫలం చేయ దానికి ప్రభుత్వం సైతం సమాయత్తమైంది. మన్యం ప్రాంతమంతా భారీగా బలగాలను మోహరించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లావ్యాప్తంగా పోలీసు బలగాలను పెద్దఎత్తున మోహరించారు. జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అరకు, చింతపల్లి వంటి ప్రధాన ప్రాంతాలలో సీఆర్‌పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించారు. ఇటు బంద్, అటు ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పగడ్బందీ చర్యలు చేపట్టారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బంద్ నుంచి గిరిజన సంఘాల ఐక్య వేదిక మినహాయింపు ఇచ్చినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు యథావిధిగా తెరవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే ఉత్తర్వులు పంపారు.

గిరిజనులకు నష్టం: జేవీఎస్ఎన్

బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం గిరిజనుల ప్రయోజనాలకు నష్టమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి చెప్పారు. ఆర్థికంగా, సామాజి కంగా గిరిజనులు వారికంటే వెనుకబడి ఉన్నారని తెలిపారు. బోయ, వాల్మీకిలు రాయలసీమలో ఉన్నారని, బెంతు ఒరియాలు ఒడిశా నుంచి మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర జిల్లాలకు వలస వచ్చారని చెప్పారు. వారిని ఎస్టీ జాబితాలో చేరిస్తే గిరిజనులు పూర్తిగా నష్టపోతారన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు వారిలో కనపడవని అన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు.

చిత్రకారుడు చిరంజీవికి నారాయణ అభినందనలు

విశాలాంధ్ర-తిరుపతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు పల్లే చిరంజీవి ఓ క్లాత్‌పై కాఫీ పొడితో చిత్రీకరించిన అంబేద్కర్ చిత్రపటాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి, సీపీఐ బృందం గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పరిశీలించారు. అనంతరం నారాయణ, హరినాథరెడ్డి మాట్లాడుతూ పల్లె చిరంజీవి, ఆయన సతీమణి అశ్వనీ పట్టుదల, సంకల్పం నెరవేరాలని ఆకాంక్షించారు. బీఆర్ అంబేద్కర్ గొప్ప నాయకుడని, ఆ మహనీయుడి చిత్రపటాన్ని భారీస్థాయిలో ఏర్పాటు చేసి తిరుపతి యూనివర్సిటీ నుండి ఢిల్లీకి తీసుకెళ్లాలన్న చిరంజీవి ఆలోచన మంచిదని చెప్పారు. ఇలాంటి చిత్రకారులను ప్రభుత్వం గుర్తించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, బుక్ ఆఫ్ లిమ్కాలలో స్థానం దక్కేలా కృషి చేయాలని హితవు పలికారు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే ఎందరో మహనీయులను వెలుగులోకి తీసుకొచ్చిసమాజానికి అందించే బాధ్యత చిరంజీవి తీసుకుంటాడని అభినందించారు. కాగా, 132 అడుగుల అంబేద్కర్ చిత్ర పటానికి అవసరమైన సహాయ సహకారాలను తిరుపతి జిల్లా కమ్యూనిస్టు పార్టీ అందిస్తుందని చిరంజీవికి భరోసా ఇచ్చారు. అంబేద్కర్ చిత్రపటాన్ని సందర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, జె.విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి జె.నాగరాజు, బి.నాగభూషణం, జగన్నాథం ఉన్నారు.

ఆర్థర్‌ను కలిసిన అజయ్ ఎవరు?

ఎమ్మెల్యే మాటలకు అర్థమేమిటి?

విశాలాంధ్ర-మిడుతూరు: శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో జరిగిన క్రాస్ ఓటింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రత్యేకించి అధికార వైసీపీలో అంతర్మథనం మొదలైంది. మరోవైపు, వైసీపీ ఎమ్మెల్యేలు రోజుకొకరు బయటికి వచ్చి... ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేస్తే కోట్లిస్తామని తమకు ఫోన్లు చేశారని చెబుతున్నారు. అందులో భాగంగానే నంద్యాల జిల్లా నందికొట్కూరు శాసనసభ సభ్యుడు తోగూర్ ఆర్థర్ కూడా తనకు డబ్బు ఆశచూపినట్లు చెప్పారు. ఎన్నికకు ముందు రోజు తన కుమారుడు వివేక్ సందీప్‌కు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడని, అదే వ్యక్తి తాను విజయవాడలో బస చేసిన నివాసానికి వచ్చాడని తెలిపారు. అయితే నేరుగా ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడకుండా డొంక తిరుగుడుగా తనకు కర్నూలు పట్టణ 3టౌన్ సీఐతో పని ఉందని, దానికోసమే మాట్లాడటానికి వచ్చానని చెప్పినట్లు ఆర్థర్ వెల్లడించారు. 'నువ్వు ఎవరు' అని నిలదీయగా తన పేరు అజయ్ అని, తనతో రహస్యంగా మాట్లాడటానికి వచ్చా నని చెప్పడంతో కంగుతిన్నానని తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సీపీఎం నూతన కార్యాలయం శంకుస్థాపనకు హాజరైన ఆర్థర్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పడం లో ఆంతర్యమేమిటని ప్రజలు చర్చించుకుం టున్నారు. అజయ్ అనే వ్యక్తి వైసీపీకి చెందిన వాడా లేక టీడీపీకి చెందిన వాడా తేలాల్సి ఉంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు కోసమే ఆర్థర్‌ను అజయ్ కలిసినట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికలు జరిగిన వారం రోజుల తర్వాత ఎమ్మెల్యే ఆర్థర్ స్పందించడంలో అర్థమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నివాసంలోనే తాను బస చేశానని, అప్పుడు అజయ్ తనను కలిశాడని, ఈ విషయం శిల్పాకు తెలియజేశానన్నారు. కానీ అప్పుడే ఆర్థర్ ఈ విషయం ఎందుకు బయటపెట్టలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓ వైపు రూ.200 కోట్లు, మరోవైపు సీఎం జగన్ ఫొటో ఉంటే...తాను జగన్ ఫొటో వైపే మొగ్గుచూపుతానని ఆర్థర్ అంటున్నారు. అయితే ఆయన మాటలు ఎవరికీ అర్థం కావడం లేదు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-భీమడోలు: దురంతో ఎక్స్‌ప్రెస్ ఏలూరు జిల్లా భీమడోలు వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. 130 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న దురంతో ఎక్స్ ప్రెస్‌కు భీమడోలు రైల్వేగేటు వద్ద ఓ వాహనం అడ్డంగా వచ్చింది. అంత వేగాన్ని నియంత్రించడం సాధ్యం కాకపోవడంతో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ప్రమాదంతో రైలు 6 గంటలు ఆలస్యంగా గమ్యం చేరుకుంది. ఈ ప్రమాదం గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో జరిగినట్లు తెలుస్తోంది. భీమడోలు రైల్వే గేటు వద్ద దురంతో ఎక్స్ ప్రెస్ వస్తుండడంతో అక్కడున్న రైల్వే గేటు సిబ్బంది గేటు మూసివేశారు. అదే సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం రైల్వే గేటును గుద్దుకుంటూ వెళ్లిపోయి సరిగ్గా పట్టాలపై ఆగిపోయింది. దురంతో ఎక్స్ ప్రెస్ రాకను గమనించిన బొలెరోలో ఉన్న వారు బయటకు దూకి పారిపోయారు. రైలు వేగంగా వచ్చి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రైలు ముందు భాగం పాక్షికంగా దెబ్బ తింది. ఈ ప్రమాదంపై రైల్వే ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో దెబ్బతిన్న దురంతో రైలు ఇంజిన్‌ను భీమడోలు స్టేషన్‌లో నిలిపివేసి వేరే ఇంజిన్‌ను అమర్చి విశాఖపట్నానికి పంపారు. ప్రమాదం కారణంగా దురంతో ఎక్స్ ప్రెస్ 6గంటల పాటు భీమడోలు స్టేషన్‌లో నిలిచిపోయింది. దీంతో అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు రైల్వే అధికారులు సేకరిస్తున్నారు.

ఉపాధ్యాయులపై కోపం పిల్లలపై చూపుతారా?

ఏప్రిల్ 1 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలి

సీఎంకు టీడీపీ ఎమ్మెల్యే అనగాని లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిన కారణంగా విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేది నుంచి రాష్ట్రంలో ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గురువారం బహిరంగలేఖ రాశారు. మార్చి గడిచిపోయినా ఒంటిపూట బడులు మొదలు కాక పోవడంతో ఎండ తీవ్రతకు పిల్లలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని, పాఠశాలలు ఒంటిపూట నిర్వహించే విషయంపై ప్రశ్నించిన టీచర్లపై మంత్రి బొత్స అవహేళన వ్యాఖ్యలు తదితర అంశాల గురించి ఆయన ఆ లేఖలో ప్రస్తావించారు. 'మార్చి నెల ముగుస్తున్నా రాష్ట్రంలో ఒంటిపూట బడులు పెట్టకపోవడం సమంజసం కాదు. మార్చి మొదటి లేదా రెండో వారంలో ఒంటిపూట బడులు పెట్టడం దశాబ్దాలుగా అమలవుతోంది. కానీ మార్చి గడిచిపోయినా ఒంటిపూట బడులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం ఒక్క రాజారెడ్డి రాజ్యాంగంలోనే సాధ్యమవుతోంది. ఉపాధ్యాయులపై కక్షసాధింపులో భాగంగానే ఒంటిపూట బడులకు ఎగనామం పెట్టారని స్పష్టమవుతోంది. ఉపాధ్యాయులపై కోపాన్ని అభం శుభం తెలియని చిన్నారులపై చూపిస్తారా? ఎండలకు పిల్లలు అస్వస్థతకు గురవకుండా ఒంటిపూట బడి పెడుతున్నారు. దాన్ని మీరు ఎలా ఆపేస్తారు? ఏప్రిల్ నెల రానే వస్తోంది. ఇంకెప్పుడు పెడతారు ఒంటిపూట బడులు? పైగా దీనిపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై విద్యామంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేయడం సిగ్గుచేటు. ఒంటిపూట బడులు పిల్లలకా? మీకా? అంటూ టీచర్లను మంత్రి చులకనగా మాట్లాడటం నీతిమాలినచర్య. ఏసీ రూముల్లో ఉంటూ ఏసీ కార్లలో తిరిగే ముఖ్యమంత్రి, మంత్రులకు స్కూలు పిల్లల కష్టాలు ఏం తెలుస్తాయి? అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఒక్క బడినైనా పూర్తిస్థాయిలో సందర్శించారా? పిల్లల ఇబ్బందులు తెలుసుకున్నారా? పట్టుమని పదిరోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించమంటే అన్ని రోజులు మా వల్ల కాదని వైసీపీ నేతలు కళ్లు తేలేస్తారు. చిన్నపిల్లలు మాత్రం మండే ఎండల్లో రోజంతా స్కూళ్లలో ఉండాలా? ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయులపై కక్షసాధింపు ధోరణి పక్కనపెట్టాలి. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్ 1 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలి' అని పేర్కొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగమే

సీఎం ఢిల్లీ పర్యటనల వల్ల ఒరిగిందేమిటి ?

సామాజిక ఉద్యమకారుడు లక్ష్మీనారాయణ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వరుస ఢిల్లీ పర్యటనలతో ప్రజాధనం దుర్వినియోగం తప్ప రాష్ట్రానికి ఒనగూరిందేమిటో చెప్పాలని సామాజిక ఉద్యమకారుడు టి.లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆ ప్రకటన ఇలావుంది. ఢిల్లీ దేశ రాజధాని. దేశ పౌరులు రాజధానికి అనేక పనులపైన పైరవీలు చేసుకోవడం కోసం వెళుతుంటారు. మన వ్యవస్థలో ఇది సర్వ సాధారణం. ఢిల్లీకి రాష్ట్రాల ముఖ్యమంత్రుల అధికారిక పర్యటనలు, సహజంగా రాష్ట్రాల ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ప్రధాన మంత్రి మోదీని, హోం మంత్రి అమిత్ షాను కలుసుకొన్నంత తరచుగా దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా, చివరకు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు సైతం కలుసుకున్న దాఖలాలు లేవు. కానీ ఆంధ్రప్రదేశ్‌కు ఒనగూడిన ప్రయోజనం ఏమైనా ఉన్నదా! అన్నదే ప్రశ్న. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం -2014లో పొందుపరచిన హక్కులతో సమానమైన కడప ఉక్కు కర్మాగారం, రాయలసీమ - ఉత్తరాంధ్ర అభివృద్ధి పథకం, ఓడరేవు, రైల్వే జోన్(ఆమోదం పొందిన విశాఖలో), రెవెన్యూ లోటు భర్తీ(ఓ నాలుగు వేల కోట్లు తప్ప), పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ -2 కు ఆమోదం - నిధుల మంజూరు, పారిశ్రామికాభివృద్ధికి పన్నుల్లో రాయితీ, ఉమ్మడి ఆస్తుల పంపిణ తదితరాలలో ఒక్కటంటే ఒక్క హామీ (నిధుల లేమితో నడుస్తున్న విద్యా సంస్థలు మినహా) అమలుకు నోచుకోలేదు. ప్రత్యేక తరగతి హోదా ముగిసిన అధ్యాయమని నిర్ద్వంద్వంగా మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. అమరావతి రాజధాని నిర్మాణ పనులను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమే ఆపేసింది. వీటికి తోడు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని వందకు వంద శాతం అమ్మేస్తామని కేంద్ర ప్రభు త్వం తెగేసి చెబుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనల కోసం ప్రత్యేక విమానాల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేసిన ప్రజాధనం వృథానా ? కాదా ? చెప్పాలని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు.

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగ రికార్డు నమోదైంది. గురువారం ఉదయం 11:01 గంటలకు 15,497 మెగా వాట్ల విద్యుత్‌ను వినియోగించారు. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికమని అధికారులు చెబుతున్నారు. ఈ నెల ఆరంభం నుంచి రాష్ట్రంలో రోజుకు సగటున 15 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. 2022 మార్చి 28న తెలంగాణ రాష్ట్రంలో 13, 867 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. గత ఏడాది మార్చిలో 13 వేల మెగావాట్ల విద్యుత్ విని యోగం రికార్డు. ఈ ఏడాది విద్యుత్ వినియోగం గత ఏడాదిని మించి పోయింది. ఈ నెల 14న తెలంగాణలో 15,062 మెగావాట్ల విద్యుత్ వినియోగించారు. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా విద్యుత్ వినియోగిస్తున్న రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతోంది. అత్యధికంగా విద్యుత్ వినియోగిస్తున్న రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానంలో తెలంగాణ నిలిచింది. వరి పంటకు అవసరమైన నీటిని అందించేందుకు రైతులు విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత విద్యుత్ వినియోగం పడిపోయే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రజల డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

సంపాదకీయం

కర్నాటకలో బీజేపీ ఎదురీత

కర్నాటక శాసనసభ ఎన్నికల మీద అందరి దృష్టి ఉంది. మరో నలభైరోజుల్లో అక్కడ మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందో లేదో తేలిపోతుంది."మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే" అన్న మాట కర్నాటక ఎన్నికలలో కుదిరేట్టు లేదు. కర్నాటకలో ముక్కోణ పోటీ జరుగుతోంది. బీజేపీ, కాంగ్రెస్, జనతా దళ్ (ఎస్) పోటీలో ఉంటాయి. అయితే ఎన్నికల తరవాత అవకాశం వస్తే కాంగ్రెస్, జె.డి.ఎస్. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అంగీకారానికి రావచ్చు. ముక్కోణపు పోటీ సంప్రదాయం ఆ రాష్ట్రంలో చాలా కాలం నుంచే ఉంది. 2013లో మాత్రం ఎడ్యూరప్ప బీజేపీ మీద తిరగబడి సొంతంగా ఓ పార్టీ పెట్టుకున్నప్పుడు చతుష్కోణ పోటీ జరిగింది. ఆ తరవాత ఎడ్యూరప్ప మళ్లీ బీజేపీలో చేరిపోయారు. ఇప్పుడు ఆయనే బీజేపీ ప్రధాన ప్రచారకుడిగా ఉన్నారు. బీజేపీ గెలిచినా ఆయన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు అయితే లేవు. కాని తన కుమారుడిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టాలన్నది ఆయన చిరకాల వాంఛ. 2018లో ముక్కోణపు పోటీ జరిగినప్పుడు మొత్తం 224 స్థానాలున్న శాసనసభలో బీజేపీ 104 సీట్లు సంపాదించింది. కాంగ్రెస్ కు 80 దక్కాయి. జె.డి.(ఎస్) కు 37 స్థానాలు వచ్చాయి. కానీ అతి పెద్దపార్టీగా అవతరించిన బీజేపీకన్నా కాంగ్రెస్ కు సమకూరిన ఓట్ల శాతం ఎక్కువ. బీజేపీకి 36.4 శాతం ఓట్లు వస్తే కాంగ్రెస్ కు 38.1 శాతం ఓట్లు వచ్చాయి. జె.డి.(ఎస్) 18.3 శాతం ఓట్లు సాధించింది. ఏ పార్టీకి మెజారిటీరాని స్థితిలో గవర్నర్ మద్దతుతో మెజారిటీ లేకపోయినా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎడ్యూరప్ప ముఖ్యమంత్రి అయ్యారు. కానీ మెజారిటీ నిరూపించుకోలేనందువల్ల ఆ ప్రభుత్వం నిలబడ లేదు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఆ తరవాత కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు ఉన్నప్పటికి జె.డి.(ఎస్) నాయకుడు హెచ్.డి.కుమార స్వామి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ కుమారుడు. కానీ కొన్ని నెలల్లోనే షరా మామూలుగా "ఆపరేషన్ లోటస్" ద్వారా కాంగ్రెస్, జె.డి.(ఎస్) శాసనసభ్యులను ప్రలోభ పెట్టి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కర్నాటకలో ప్రస్తుత పరిస్థితిని, బీజేపీ ప్రభుత్వంపై రగులుతున్న అసమ్మతినిబట్టి చూస్తే బీజేపీ అధికారం నిలబెట్టుకోలేదేమో అన్న అభిప్రాయం కలుగుతోంది. అంతర్గతంగా బీజేపీ కలహాలు ఎదుర్కుంటోంది. ప్రభుత్వ పని తీరు మీద జనంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఒక వేళ బీజేపీ ఓడిపోతే జె.డి.(ఎస్) కింగ్ మేకర్ పాత్ర నిర్వహించవచ్చు. ఉన్న పరిస్థితినిబట్టి కాంగ్రెస్ కు విజయావకాశాలు ఎక్కువే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అనుకూలాంశం కావచ్చు. అధికారం నిలబెట్టుకోవడానికి తంటాలు పడ్తున్న బీజేపీ ఎడ్యూరప్పను తప్ప స్థానిక నాయకులను పూర్తిగా పక్కన పెట్టేసింది. ప్రచార బాధ్యతను మోదీ తలకెత్తుకుంటే వివిధ రకాల సమీకరణలు కుదర్చడానికి అమిత్ షా కృషి చేస్తున్నారు. అయితే ఆర్.ఎస్.ఎస్. కర్నాటకలో బలంగానే ఉంది. స్థానికంగా బలమైన నాయకుడు లేకపోవడం అననుకూలంగా పరిణమించవచ్చు. కాంగ్రెస్ కు మాత్రం సిద్ధ రామయ్య, డి.కె.శివకుమార్ బలమైన నాయకులే. కానీ వారిద్దరి మధ్య విభేదాలున్నాయి. అయితే ఇప్పుడు అధికారం సంపాదించడం కీలకం కనక తాత్కాలికంగా సంధి కుదుర్చుకోవచ్చు. జె.డి.(ఎస్) రంగంలో లేకపోతే కర్నాటకలో బీజేపీకి, కాంగ్రెస్ కు మధ్య మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ లో లాగా ముఖా ముఖి పోటీ జరిగేది. పాత మైసూరు ప్రాంతంలో జె.డి.(ఎస్)కు పలుకుబడి ఉంది. కర్నాటక రాజకీయాలు ఆ రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాంతాల రాజకీయ స్వరూపం మీద ఆధారపడి ఉన్నాయి. కర్నాటకను ముందు హైదరాబాద్ సంస్థానంలో ఉన్న కర్నాటక, ముంబైతో సంబంధం ఉన్న కర్నాటక, మధ్య కర్నాటక, కోస్తా కర్నాటకగా విభజించ వచ్చు. ఇందులో ముంబైతో సంబంధం ఉన్న కర్నాటకలో, మధ్య కర్నాటకలో, కోస్తా కర్నాటకలో బీజేపీకి పట్టుఉంది. మిగతా ప్రాంతాలలో ఇదివరకటి కన్నా ఎక్కువ సీట్లు సంపాదిస్తే తప్ప బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. 2018 ఎన్నికలలో పాత మైసూరులో ఒక్కలిగ ఓట్లను కాంగ్రెస్, జె.డి.(ఎస్) సాధించాయి. ఆ రెండు పార్టీలకు రెండంకెల స్థానాలు దక్కాయి. 2004 నుంచి 2018 దాకా జరిగిన ఏ ఎన్నికలలోనూ బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం ఎప్పుడూ కాంగ్రెస్ కన్నా అధికంగా లేదు. కాంగ్రెస్ కు సీట్లు తక్కువ వచ్చి ఉండొచ్చు. ఇది ఎవరు ముందు గీత దాటితే వారే విజేతలు అన్న మన ఎన్నికల విధానంలో ఉన్న లోపం. ఈ పద్ధతిలో ఓట్ల శాతానికి, సీట్లకు పొంతన ఉండదు.

బీజేపీ ఇప్పటిదాకా ప్రస్తుత ముఖ్యమంత్రి బొమ్మైని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. కానీ ఎన్నికల ప్రచార కమిటీకి ఆయనే నాయకుడు. కానీ ప్రచారంలో ప్రధాన పాత్ర ఎడ్యూరప్పదే. రెండు మూడేళ్లుగా బీజేపీ ఎడ్యూరప్పను, ఆయన కుటుంబాన్ని అంతగా పట్టించుకోలేదు. కాని ఇటీవలి కాలంలో అమిత్ షా, మోదీ కలిసి ఎడ్యూరప్పను బుజ్జగించే ప్రయత్నం చేసి సఫలమైనట్టున్నారు. ఎడ్యూరప్ప లింగాయత్ లకు ప్రతినిధి. కానీ ముఖ్యమంత్రి పదవి ఫలానా వారికి ఇస్తామని బీజేపీ ఈ దశలో ప్రకటించక పోవడానికి ప్రధాన కారణం బలమైన ఒక్కలిగ లాంటి సామాజిక వర్గాలను దూరం చేసుకునే స్థితిలో లేదు. కర్నాటక ప్రజలు సహజంగానే అనేక సమస్యలు ఎదుర్కుంటున్నందువల్ల ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రంగానే ఉంది. నిరుద్యోగ సమస్య, అధిక ధరలు, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలు దేశమంతటా ప్రభావం చూపుతున్నట్టుగానే కర్నాటకలో కూడా ఆ ప్రభావం తప్పదు. అయితే సమాచార సాంకేతికతకు కేంద్రమైన కర్నాటకను మన సిలికాన్ వ్యాలీ అంటారు. కానీ ఈ రంగంలోని వారి ఉద్యోగాలు వేల సంఖ్యలో ఊడుతున్నాయి. ఇది బెంగళూరులో మాత్రమే ఉన్న సమస్య కాదు.

రిజర్వేషన్ల విధానాన్ని కర్నాటక ప్రభుత్వం ఇటీవలే సవరించింది. కొన్నివర్గాలకు వర్తించే రిజర్వేషన్లు పెంచింది. ఈ క్రమంలో ముస్లింలకు ఉన్న నాలుగు శాతం రిజర్వేషన్లను తొలగించి ఆర్థికంగా వెనుకబడిన రిజర్వేషన్లు పెంచింది. ఈ మార్పులవల్ల రిజర్వేషన్లు తగ్గిపోతాయన్న భయంతో ఇటీవలే బంజారాలు ఆందోళనకు దిగి ఎడ్యూరప్ప ఇంటిమీద రాళ్లు విసిరేదాకా వెళ్లాయి. ముస్లింల రిజర్వేషన్లను పూర్తిగా తొలగించడం అంటే హిందుత్వ రాజకీయాలను ఒక అడుగు ముందుకు తోయడమే. మోదీ, అమిత్ షా సర్వాంతర్యాములుగా మారిపోయారు. అందుకే ఒకప్పుడు బీజేపీలో సమర్థ నాయకులున్నా ఇప్పుడు వారందరూ పక్కకు తొలగిపోయేట్టు చేశారు. 1985 తరవాత అధికారంలో ఉన్న ఏ పక్షమూ కర్నాటకలో రెండో సారి గెలవలేదు. 2004 తరవాత మూడు సార్లు ఏ పక్షానికీ మెజారిటీ రాలేదు. ఈ అంశాలన్నీ బీజేపీకి ప్రతికూలమైనవే.

సిద్ధాంతాలు లేని పార్టీలు

రా బావ ఏంటి ఈ రోజు చాల సంతోషంగా నోటితో ఈల వేసుకుంటూ వస్తున్నావు. ఆ ఏంలేదు బావ. గత ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ లాంటిది కాదు. మా పార్టీకి నియమనిబద్ధతలున్నాయి. సీత గీత దాటితే ఏమైందో మా సభ్యులకు కూడా అదే గతి అన్న జగన్‌కు షాకిచ్చి ఇద్దరు శాసనసభ్యులు గీత దాటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు. మారినకాలం, నైతిక విలువలు కోల్పోయిన సంగతి జగన్‌కు కూడా ఇపుడు బోధపడిందని నవ్వుతూ వస్తున్నానంతె.

అదినిజమే, ప్రస్తుతం అనేక రాజకీయపార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటికి ఏ రకమైన సిద్ధాంతంగానీ, ఆశయంగానీ ఉండవు. ఎటువంటి నిబద్ధత, నియమాలు లేవు. గతంలో సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలకు ఒక సిద్ధాంతం, నిబద్ధతతో కూడిన ఆశయం ఉండేది. దానికోసం ఎందరో నాయకులు ఆశయ సిద్ధికొరకు ప్రాణాలర్పించిన సంఘటనలున్నాయి. ఆ తరువాత స్వాతంత్ర్య సాధనకోసం కాంగ్రెస్ అవతరించింది. స్వాతంత్ర్యం కోసం చేసే ఉద్యమంలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు కూడా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెసు పార్టీ నాయకత్వంలో నెహ్రూ, పటేల్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. నెహ్రూ ప్రధానిగా ఉన్నంతకాలం దాదాపు



ప్రజాస్వామ్యపద్ధతిలోనే పార్లమెంటుసమావేశాలు జరిగాయి. ప్రతిపక్షంలో పుచ్చలపల్లి సుందరయ్య, హిరేన్‌ముఖర్జీ, భూపేష్‌గుప్తా, అశోక్ మెహతా, కృపలాని, లోహియా లాంటి ఉద్దండులున్నారు. ఆనాడు సోషలిస్టు, కమ్యూనిస్టులకు కూడా మాట్లాడటానికి అవకాశం ఇచ్చేవారు. అంతేగాక ప్రభుత్వం తెలిసో తెలియకో ప్రజావ్యతిరేక నిర్ణయం తీసుకుంటే ప్రతిపక్ష నాయకులు ఖండిస్తే మంచి మనసుతో ఆ నిర్ణయాలు వెనక్కి తీసుకున్న సందర్భాలు ఆనాటి ఎన్‌సైక్లోపీడియాలో చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. నెహ్రూ మరణానంతరం కొద్దికాలం లాల్‌బహదూర్‌శాస్త్రి ఉన్నా ఆ తరువాత ప్రధాని అయిన ఇందిరాగాంధీ నుంచి దాదాపు నియంతపాలన మొదలై ఇప్పుడు ప్రధాని మోదీ వరకు కొనసాగుతూనే ఉంది. ఆనాడు ఇందిర రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని దించి నియంతృత్వ ప్రధానిగ పేరుగాంచింది. నిజమే అసలు పునాదులే లేనపుడు ఇలాగే జరుగుతుంది గదా. అదే నే చెప్పేది. ఎంతో క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుపార్టీలో కూడా ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటుంటే, వైసీపీవిషయంలో ఆశ్చర్య పడ వలసిన పనేముంది. అదిసరే బావ ముగ్గురు ఎంఎల్‌సీలు గెలవగానే 2024లో ప్రభుత్వం ఏర్పాటుచేస్తానని సంబరపడి స్టేట్‌మెంట్ ఇచ్చిన వెంటనే ఆయన తెరవెనుక చేసిన కుట్రను బైటపెట్టి నోరుమూయించారు కదా! స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలోను, తాత్కాలిక అసెంబ్లీ హైకోర్టు తదితర నిర్మాణాల్లో కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు దండుకున్న నైజం సాక్షాత్తు అసెంబ్లీ సమావేశాల్లోనే బైటపెట్టాడు జగన్. మొత్తం బైటపడటంలో ఎదుగుతున్న కాళ్లకు బంధం పడినట్లయింది. అదే నే చెప్పేది ఎటువంటి సిద్ధాంతాలు, ఆశయాలు లేకుండా పుట్టిన పార్టీలలో స్వార్థపరులు చేరడంతో ఇటువంటి సంఘటనలు తప్పవు. చోటా నాయకులు కాకుండా పార్టీ అడిగితేనే ఈ పని చేయడంతో పార్టీని నమ్ముకున్న కింది నాయకులు ఒక్కసారిగ అవాక్కయ్యారు బావ.

అది సరేలే బావ వ్యవస్థలో మార్పు తేవాలనే మాటకు విలువిచ్చి ఆ ఇద్దరికి ముందే ఈసారి టికెట్ ఇవ్వనని చెప్పడంవలన వాళ్లు క్రాస్ ఓటింగ్ చేశారని వైసీపీ వాళ్లంటున్నారు. కాని అంతలోతుగ ప్రజలు అర్థం చేసుకోగలరంటావా. ఆ మాట నిజమే. మార్పు అనేది అవసరం అనుకున్నపుడు ఎవరో ఒకరు మొదలు పెట్టాలిగ. ప్రస్తుతం గెలిచిన కైకలూరుకు చెందిన వెంకటరమణ చంద్రబాబుని నమ్మించి మోసం చేసాడంటున్నాడుగ. అలాగే జగన్‌ని కూడా అనవచ్చుగదా అది సరే స్కిల్‌డెవలప్‌మెంట్ విషయంలోను అమరావతి కాంట్రాక్టరు వద్ద సొమ్ము తీసుకున్నట్లు రుజువైతే చంద్రబాబు అరెస్టు అవుతాడంటారా. భలేవాడి వయ్యా చంద్రబాబును అలా తక్కువ అంచనా వేయకు. ఆయన కోర్టు లను మానేజ్‌చేయగలడని అంటారు కదా! ఆయనకు స్టేల బాబు అనే పేరుంది. స్టేలతో ఒకసంవత్సరం గడిపితే తరువాత తన ప్రభుత్వం వస్తుందనే ధీమా ఆయనలో ఉంది..నిజమే అందుకేనేమో మరల ముఖ్యమంత్రి గానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశాడు. నాకు తెలియక అడుగుతాను, చంద్రబాబు వారసత్వాన్ని పోషిస్తున్నాడు కానీ లోకేష్ కేముంది? మరో గుర్తింపు ఉన్న నాయకుడితో పాదయాత్ర చేయిస్తే బాగుండేదేమో, కన్నప్రేమ, అధికారం ఆ పనిచేయనివ్వరుగ. అంతెందుకు జూనియరు ఎన్‌టీఆర్‌ను ప్రోత్సహిస్తే పార్టీ బలపడి అధికారం జేజిక్కించుకోవచ్చునని ఆ పార్టీలో చాలమంది అభిప్రాయం. కాని తన కుటుంబం నుండి అధికారం చేజారిపోతుందని చంద్రబాబు అందుకు అంగీకరించడంటారు. చూడు బావ ఏది ఏమైనా గతంలో రాజకీయ పార్టీలకున్న నైతిక విలువలు నేడు స్థానిక పార్టీలకు లేదు. అందుకు సిద్ధాంతాలతో పార్టీ స్థాపించక పోవడమే కారణం. అందుకే సంపాదన కోసం యంఎల్‌ఏ టికెట్టు గెలిచిన తర్వాత సంపాదన, సంపాదించిన సొమ్ముతో ఓట్లుకొని మరల గెలవడం, ఇదే ప్రస్తుత పార్టీల సిద్ధాంతం. అందుకే ఇలా పార్టీలు మారడం.

వ్యాస రచయిత సెల్: 9885569394

దేశాలను, ప్రభుత్వాలను శాసిస్తున్న కార్పొరేట్ సంస్థలు!

నేడు ప్రపంచ వ్యాపితంగా బడా కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం చలాయిస్తున్నాయి. వీటి ఆధిపత్యం ఆర్థిక రంగానికే కాక రాజకీయ, సాంస్కృతిక రూపాల్లోనూ కొనసాగుతున్నది. కార్పొరేట్ శక్తులకు మార్కెట్ విలువ తప్ప ఎటువంటి విలువలు ఉండవు. తమ ఆర్థిక అధికారాన్ని విస్తరింప చేసుకోవటానికి ఎంతటి నీచానికైనా సిద్ధమౌతాయి. కార్పొరేట్ల పూర్తి స్వభావం తెలుసుకోవాలంటే వాటికి ఉండే రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మూలాలను అర్థం చేసుకోవాలి.

ప్రపంచ చరిత్రలో ఏ కార్పొరేట్ సంస్థ కూడా రాజ్యం ప్రోద్బలం, సహకారం లేకుండా మనుగడ, విస్తరణ సాధించటం జరగలేదు. స్పానిష్ కంపెనీకి పోర్చుగీస్,ఈస్ట్ ఇండియా కంపెనీకి బ్రిటన్ ప్రభుత్వాల సహకారం లభించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పరిమితంగా ఉన్న మానవ వనరులను సరిగా ఉపయోగించుకుని అభివృద్ధిని, సేవలను పెంపొందించాలంటే కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ మార్గమని సామ్రాజ్యవాద పాలకులు ఒక సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. దానికి అనుగుణంగా ఉనికిలోకి వచ్చిన బ్రిటన్ వుడ్ సంస్థలు (ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ) కార్పొరేటీకరణకు శ్రీకారం చుట్టాయి. దాన్ని ప్రపంచ వ్యాపితం చేశాయి.

స్వేచ్ఛా మార్కెట్ రాజకీయ, ఆర్థిక అంశాలను సిద్ధాంతీకరించటానికి కొత్త సంస్థలు, థింక్స్ టాట్స్ పుట్టుకొచ్చాయి. లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల నుంచి వచ్చే విద్యార్థులకు స్వేచ్ఛ మార్కెట్ ఆలోచనలను నూరిపోసి కొందరిని గుంపును తయారుచేయగలిగారు. వీరినే "చికాగో బోయ్స్,, అంటారు. చికాగోబోయ్స్ సలహా ప్రకారం ప్రభుత్వ రంగ ఆస్తులను, సేవలను ప్రైవేటీకరించి, కార్పొరేటీకరించిన మొదటి దేశం చిలీ. అమెరికన్ గూఢచారి సంస్థ, చికాగో బాయ్స్ సమన్వయంతో చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చి కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలను అమలు జరిపే ప్రభుత్వాలను గద్దె మీద కూర్చొపెట్టాయి. 11-9-1973న చిలీలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పడిన సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వాన్ని అమలు జరిపిన అగస్టో పినోషెట్ అధికారంలోకి రావటానికి సిఐఏ తోడ్పడితే, దేశ ఆర్థికవ్యవస్థ కొద్దిమంది చేతుల్లోకిపోయేలా చికాగో బోయ్స్ చేయగలిగారు. ఫలితంగా అగస్టో పినోషెట్ 1973-1990మధ్య కాలంలో రెండుదపాలుగా దాదాపు దేశంలోని అన్ని ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేటీకరణ చేశాడు.

బహుళజాతి కార్పొరేషన్లు ప్రపంచంలోని అన్ని ఉత్పత్తి, వినిమయ, సేవా రంగాలను తమ గుప్పెట్లో పెట్టుకోగలుగు తున్నాయి. బడా ఆరు కార్పొరేట్ సంస్థలు 72% గ్లోబల్ విత్తనాలను కంట్రోల్ చేస్తున్నాయి. 79% పురుగు మందుల తయారీ మార్కెటింగ్ రంగాన్ని 6 సంస్థలు తమ స్వాధీనంలో పెట్టుకున్నాయి. టాప్ పది ఎరువుల మందుల కార్పొరేట్లు 50% మార్కెటింగ్ చేస్తున్నాయి. ఆరు శాతం కంపెనీలు 52% వ్యవసాయ యంత్రాల ఉత్పత్తి,

సరఫరా ప్రపంచ మంతా చేస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు ఎప్పుడు తమ ఖర్చులు తగ్గించుకోవటానికి కొత్త కొత్త టెక్నాలజీలను పెడతాయి. దీని వలన సేవారంగంలో కొన్ని పరిమిత ఉద్యోగఅవకాశాలు పెరిగినా, ఉత్పత్తి రంగంలో అవి తీసుకొచ్చే టెక్నాలజీ వలన శ్రామికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ టెక్నాలజీ బదిలీ ద్వారా శ్రమశక్తిని, ప్రకృతిని కొల్లగొట్టే పద్ధతినే సృజనాత్మక విధ్వంసం అంటారు. వ్యవసాయంలో ఒక ట్రాక్టర్ కనీసం పది మంది రైతు కూలీలకు పని లేకుండా చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ లో యంత్రాలవినియోగం వలన 140 నుంచి 50రోజులకు పని దినాలు తగ్గాయి.

కార్పొరేట్ సంస్థలు ఏ దేశంలో కొత్త టెక్నాలజీ ప్రవేశ పెట్టినా, దానికి సంబంధించిన ఫార్ములాను పంచుకోవటం జరగదు. 1980లో కోకాకోలా కంపెనీ ఇండియాలో తన ప్లాంట్ పెట్టే ప్రయత్నం చేయగా, భారత ప్రభుత్వం పార్ములా చెబితేనే ప్లాంట్ ఏర్పాటుకి అనుమతిస్తానని చెప్పటంతో కోకాకోలా కంపెనీ వెనక్కిపోయింది. ఆ తర్వాత ఆ కంపెనీకి లొంగిపోయిన భారత పాలకులు ఎటువంటి షరతులులేకుండా ప్లాంట్‌ఏర్పాటుకి అనుమతి ఇచ్చారు.

అంతర్జాతీయ పెట్టుబడులకు సంబంధించి భ్రమలు కల్పించే ఒక ప్రచారం జరుగుతున్నది. పెట్టుబడుల వలన మెరుగైన టెక్నాలజీ వస్తున్నదని, మానవ వనరులు పెరుగుతాయని, దేశీయంగా ఉత్పత్తుల పోటీ పెరిగి సరుకుల, సేవల నాణ్యత పెరుగుతుందని, ఎగుమతుల వలన విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందని ఫలితంగా దేశం అభివృద్ధి చెందుతుందని కొందరు మాట్లాడుతున్నారు. ఇలాంటి ప్రచారం బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలను కాపాడటం కోసమే. బహుళ జాతి కంపెనీలు ఎవ్వరినీ ఉద్ధరించటానికి ఏర్పడలేదని, తమ సొంతలాభమే వాటికి ముఖ్యమని ఇలాంటి వారు గ్రహించటంలేదు. వెనుకబడిన దేశాల్లో బహుళజాతి కంపెనీలు పెట్టుబడులు పెట్టటానికి కారణం అక్కడ చౌకగా దొరికే సహజ వనరులు, తక్కువ వేతనాలతో కార్మికులు, బలహీనమైన చట్టాలు, లాభదాయకమైన ట్యాక్స్ పాలసీల వలన తమ దేశాలలో కన్నా వెనుకబడిన దేశాలలోనే ఈ సంస్థల ఎక్కువ లాభాలు పొందుతున్నాయి. బహుళజాతి టాప్ కంపెనీల ఆస్తులను చూస్తే కళ్లు గిర్రున తిరుగుతాయి. 1990లో 50 టాప్ కార్పొరేషన్ల మార్కెట్‌విలువ ప్రపంచ స్థూలదేశీయోత్పత్తిలో 4.7%గా ఉంది. అది 2020 నాటికి 27%కి పెరిగింది. ఈ మొత్తం కార్పొరేషన్ల సంపదలో 69% అమెరికాలో పోగుపడింది. ప్రపంచ మంతా పట్టు కలిగిన 100టాప్ కార్పొరేషన్లలో 59 అమెరికా ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నాయి. ఒక్క ఆపిల్ కార్పొరేట్ సంస్థ మార్కెట్ విలువ 2.7 ట్రిలియన్ డాలర్లు కన్నా ఎక్కువ. వాల్ మార్ట్ కార్పొరేట్ సంపద 161 దేశాల ఆర్థిక వ్యవస్థ కన్నా పెద్దది. ప్రపంచంలో అతిపెద్ద 100 ఆర్థిక వ్యవస్థల్లో 49 దేశాలు ఉంటే, వాటిల్లో 51 కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలు ప్రజలు ఏమి తినాలి, ఎలాంటి వినోదాన్ని కోరుకోవాలి, ఎలాంటి వార్తలు వినాలి, ఆలోచనలు చేయాలి, ఎక్కడ పని చేయాలి, ఎట్లా బతకాలి, ఎలాంటి సమూహంలో ఉండాలన్న దాన్ని నిర్ణయిస్తున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాలను, సమాజాలను శాసిస్తున్నాయి.

నేడు ప్రపంచ దేశాల్లో భారతదేశం బహుళజాతి సంస్థల వ్యాపారానికి, వాటి దోపిడీకి ప్రధానకేంద్రంగా ఉంది. 1980లో నూతన ఆర్థిక విధానాలను, 1991 సరళీకరణ ఆర్థిక విధానాలను దేశ పాలకులు అమలు చేయటం, 1993లో ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటం, వ్యవసాయక ఒప్పందాన్ని అమోదించటం ద్వారా విదేశీ పెట్టుబడులకు, బహుళజాతి సంస్థల వ్యాపారానికి దేశంలో తలుపులు బార్లా తెరవబడ్డాయి. మోన్‌శాంటో భారతదేశంలో విత్తన వ్యాపారం ప్రారంభించి ప్రతి సంవత్సరం వెయ్యి కోట్లు లాభాలరూపంలో తరలించుకుపోతున్నది. పత్తి విత్తనం 80% మోన్ శాంటానే విక్రయిస్తున్నది. వంగ, బెండ, మొక్కజొన్న, ఆవాలు మొదలైన విత్తన విక్రయాలకు కూడా పాలకులు ఆ కంపెనీకి అనుమతించారు. విదేశీ పురుగు మందుల వ్యాపారానికి దేశం నిలయమైంది.

తనదైన మార్క్‌తో మోద ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు సేవ చేస్తున్నది. అందుకోసం ప్లానింగ్ కమీషన్‌ను రద్దు చేసి, నేషనల్ ఇన్ స్టూట్ ఫర్ ట్రాన్స్ పార్మింగ్ ఇండియా అయోగ్‌ను ఏర్పాటుచేసింది. అదిచేసేదల్లా అనేక రంగాల్లో ప్రైవేటీకరణకు, కార్పోరేటీకరణకు, విదేశీ పెట్టుబడులకు మార్గం సుగమం చేయటం. మోదీ ప్రభుత్వ పాలనలో సమస్త రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను, ఆస్తులను అమ్మివేయటం, వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేయటం, అందుకోసం రైతుల భూములు వాటి పరంచేసే వ్యవసాయవిధానాలు అమలు జరపటం చేస్తున్నది. ఫలితంగా భారతదేశంలోని అన్ని రంగాలలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశిస్తున్నాయి. ఇవి దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థలను నియంత్రిస్తున్నాయి. ఇవి దేశ ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారాయి. దేశ ప్రజలందరూ ఈ ప్రమాదాన్ని గ్రహించి బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

శాంతిని అడ్డుకుంటున్న అమెరికా



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

అమెరికా తన "పొడుగు చేతుల అధికార పరిధి"ని ఇతర దేశాలపై అనేక రంగాల్లో విస్తరిస్తోంది. ఇది దాని పోటీ విధానం.తన సామర్థ్యం, ఆర్థిక ఆధిపత్యం, దేశీయ చట్టాలను ఇతర దేశాలపై దుర్వినియోగం చేసి తన ఆక్రమణ విధానాలను అమలుచేస్తోంది. ఆ ప్రయోజనం కోసం, అమెరికా సంక్లిష్ట చట్టాల వ్యవస్థను రూపొందించింది. గరిష్ట పరిమితులను తగ్గిస్తోంది. తన విచక్షణాశక్తిని విపరీతంగా పెంచింది. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య చర్చలు జరగకుండా, శాంతి నెలకొనకుండా అమెరికా చర్యలు అడ్డుకుంటున్నాయి.

ట్రంప్ 3,900 ఆంక్షలు విధించారు. సగటున రోజుకు 3 ఆంక్షలు. 2021 ఆర్థిక సంవత్సరంలో అమెరికా 9,400 ఆంక్షలు విధించింది. తన"పొడుగు చేతుల అధికార పరిధి"అమెరికాతో వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచింది. క్యూబా నుండి రష్యా వరకు, ఇరాన్ నుండి లిబియా వరకు, తన ఇష్టాన్ని, ప్రమాణాలను ఇతరులపై రుద్దింది. అమెరికా మిత్ర బృందమని భావించే యూరోపియన్ యూనియన్ కూడా దాని ఎత్తుగడలపై అసంతృప్తిగా ఉంది. అమెరికా"పొడుగు చేతుల అధికార పరిధి" విధానాన్ని అరికట్టడానికి పలుమార్లు ప్రయత్నించింది. అనేక ఎత్తుగడలను వేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వివాదాలను పరిష్కార ప్రక్రియలుగా ప్రవేశపెట్టింది.

అమెరికా చర్యలు అంతర్జాతీయ పాలనా యంత్రాంగాల పనితీరును కూడా నాశనం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి వెలుపల తన ఏకపక్ష ఆంక్షలను లెక్కలేనన్నిసార్లు విధించింది. దేశాలకు, సంస్థలకు చట్టబద్ధ సదుపాయాల కల్పనలో ఐక్యరాజ్యసమితి పాత్రను బలహీనపరిచింది. దాని సూపర్ 301 నిబంధన అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ధారించినప్పటికీ, చైనా, ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై దాని 301 నిబంధన కింద విచారణలను కొనసాగిస్తోంది. బహుపాక్షిక వాణిజ్య నియమాలను ఉల్లంఘిస్తోంది. ఆ విధానంతో, వాణిజ్య పోటీదారులను దెబ్బకొట్టడానికి,అంతర్జాతీయ వ్యాపార కార్యకలాపాలలో జోక్యం చేసుకోవడానికి అమెరికాతన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోంది. జపాన్‌లోని తోషిబా, జర్మనీలోని సీమెన్స్, ఫ్రాన్స్‌లోని ఆల్‌స్టోమ్‌లు అమెరికా సముద్ర దొంగల వంటి పనుల వల్ల నష్టపోయాయి. అమెరికా చర్యలు ఇతర

వాషింగ్టన్‌లో కాపిటల్ హిల్ పై సూర్యోదయ సమయంలో ఎగురుతున్న పక్షులు. వీటికున్న స్వేచ్ఛ ప్రపంచ ప్రజలకు లేదు.

దేశాలలో ప్రాథమిక మానవ హక్కులను కూడా ఉల్లంఘిస్తాయి. ఇతర దేశాలపై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలు విధించింది. మానవ విపత్తులకు కారణమయింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సిరియా, యెమెన్‌లపై విధించిన ఆర్థిక ఆంక్షలు కొవిడ్-19 విశ్వ మహమ్మారిపై పోరాడే వారి సామర్థ్యాలను బలహీనపరిచాయి. అమెరికా ఆంక్షల కారణంగా ఒక్క ఇరాన్‌లోనే కొవిడ్-19 కారణంగా 13,000 మంది మరణించినట్లు అమెరికాలో పనిచేసే బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్ అంచనావేసింది.

ఉక్రెయిన్ సంఘర్షణకు రష్యా పట్ల అమెరికా శత్రుత్వమే మూలకారణం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి 23.02.2023 న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, వివాదానికి మూలకారణాన్ని పరిష్కరించని ఏ ప్రతిపాదన అయినా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించలేదు. న్యాయమైన సమగ్ర శాశ్వత శాంతిని సాధించలేదు. ఈ యుద్ధం400 రోజులకు చేరబోతోంది. గతేడాది ఘటనల ముందు అంతర్జాతీయ సమాజం మరువరాని వాస్తవం ఒకటుంది. ఉత్తర అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటొ) నిరంతర తూర్పు విస్తరణకు రష్యా పట్ల అమెరికా శత్రుత్వమే కారణం. ఇది పాశ్చాత్య దేశాలపై రష్యా దృక్పథాన్ని మార్చింది. దూరపు భాగస్వామిగా ఉండవలసిన అమెరికా రష్యాకు వాకిటి వద్ద శత్రువుగా మారింది. సోవియట్ యూనియన్ పతనం తర్వాతి పరిణామాలతో రష్యా ఇంకా బాధపడుతుండగా ప్రచ్ఛన్న యుద్ధ కూటమి తూర్పు వైపు (రష్యా దిశగా) తన శిబిరాలను నెట్టడం రష్యా అభద్రతా భావాన్ని తీవ్రతరం చేసింది. ఉక్రెయిన్ పై రష్యా "ప్రత్యేక సైనిక చర్య" కంటే, తన చర్యలతో రష్యాకు అనూహ్య ముప్పు కలగాలని అమెరికా కోరిక. అందుకే సంఘర్షణ ముగింపునకు అమెరికా తొందరపడటంలేదు. రష్యాను కిందికి లాగి, యూరప్‌పై తన అధికారాన్ని పునరుద్ఘాటించాలని కోరుకుంటోంది. ఆయుధాల, ఇంధనశక్తి అమ్మకాలతో విపరీతమైన లాభాలు పొందుతోంది.

పశ్చిమ దేశాల చర్యలు రష్యాకు భద్రతా సంక్షోభాన్ని సూచిస్తాయి. నిరంకుశత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య పోరాటంగా అమెరికా చిత్రీకరించిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, రష్యాను నిర్వీర్యం చేయడానికి ఏళ్లతరబడి చేస్తున్న దాని సుదీర్ఘ ప్రచారానికి పరాకాష్ట. రష్యాపై తన ఏకపక్ష ఆంక్షలలో చేరడానికి నిరాకరించిన దేశాలను విమర్శిస్తోంది. తద్వారా నైతిక ఉన్నత స్థాయికి దావా వేసింది. అమెరికా తమపై మోపడానికి ప్రయత్నిస్తున్న నైతిక భారం వల్ల ఊగిసలాడకుండా ప్రపంచ దేశాలు ఈ విషయంలో తప్పొప్పులను నిష్పక్షపాతంగా పరిశీలించాలి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఇతర శాశ్వత సభ్యులలో, రష్యాపై ఆంక్షలు విధించడంలో, ఉక్రెయిన్‌కు ఆయుధాలను అందించడంలో చైనా మాత్రమే అమెరికాతో చేరలేదు. రష్యాకు దాని "ప్రత్యేక సైనిక చర్య"లో చైనా మద్దతు ఇవ్వలేదు. ఉక్రెయిన్ సంక్షోభంపై దానివైఖరి తటస్థం. కాల్పులవిరమణపై మాట్లాడాలని, యుద్ధాన్ని విరమించాలని ఇరుపక్షాలను కోరుతోంది. రష్యాతో చైనా సంబంధాలు ఏ పార్టీ ఆమోదానికి గాని ఉక్రెయిన్‌తో సంబంధాలకు గాని లోబడి లేవు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభంలో చైనా ప్రయోజనాలు లేవు."సైనిక సమూహాలను బలోపేతం చేయడం లేదా విస్తరించడం ద్వారా ఒక ప్రాంతపు భద్రత సాధ్యం కాదు. ఒక దేశ భద్రతను ఇతరుల ఖర్చుతో కొనసాగించకూడదు." అని 24.02.2023 న చైనా విడుదలచేసిన పరిస్థితి పత్రం తెలిపింది.

ఐక్యరాజ్యసమితి అధికారపూర్వకంగా ఆమోదించని, అంతర్జాతీయ చట్టంలో చట్టబద్ధతలేని ఆంక్షలను అమెరికా రష్యాపై విధించింది. ఉక్రెయిన్‌కు అత్యంత అధునాతన ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది. దాని నాటొ మిత్రదేశాలను అదేవిధంగా చేయమని ప్రోత్సహిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా తాను ఉన్నత నైతిక స్థాయిలో ఉన్నానని చెప్పడం హాస్యాస్పదం, అసంబద్ధం. రష్యాకు వ్యతిరేకంగా పరోక్ష ప్రాతినిధ్య యుద్ధం చేయించడంలో అమెరికా ప్రాథమిక దురాక్రమణదారు. కాల్పులవిరమణ, శాంతిచర్చల కోసం అవసరమైన అనుకూల పరిస్థితులను సృష్టించేందుకు పరోక్ష ప్రాతినిధ్య యుద్ధాలను ఆపడం మొదటి అడుగుకాగలదు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభానికి పరస్పరం మాట్లాడుకోవడం, చర్చలుజరపడం మాత్రమే ఆచరణీయ పరిష్కారం. ఉక్రెయిన్ సార్వభౌమ రాజ్యమైనప్పటికీ, అమెరికా కూటమి దానికి నిధులు, మద్దతు ఇస్తోంది. ఉక్రెయిన్ ఈ సహాయాల భ్రమలో చిక్కుకుంది. అది రష్యాతో మాట్లాడాలనుకున్నా, అమెరికా దానికి అనుమతించనంత కాలం, ఉక్రెయిన్‌కు వేరే మార్గంలేదు. పోరాడుతూనే ఉంటుంది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. అమెరికా తన అధికార దుర్వినియోగాన్ని విడిచిపెట్టి ప్రపంచ సమాజంలో చేరాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సెల్: 9490204545

కాంగ్రెస్‌లో ఉత్సాహం

- కర్ణాటకలో పెరుగుతున్న చేరికలు
- జేడీఎస్ ఎమ్మెల్యే, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీల చేరిక
- ఇంకా క్యూలో ఉన్నారన్న డీకే

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, బొమ్మై ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉండటంతో అధికారమే పరమావధిగా భావించే రాజకీయ నాయకులు వరుసపెట్టి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్‌కు మరింత ఊపు, ప్రోత్సాహం తీసుకొస్తున్నాయి. ఈ ఒక్క నెలలోనే ముగ్గురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా జేడీఎస్ ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తన ఎమ్మెల్యే పదవికి మార్చి 27నే ఆయన రాజీనామా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్‌తో ఉన్న 37 మంది నాయకులు తమ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ తెలిపింది. ఎన్నికలు సమీపించే కొద్దీ ఈ చేరికలు ఇంకా పెరుగుతాయని భావిస్తోంది. మాజీమంత్రి కూడా అయిన శ్రీనివాస్ మార్చి 27న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. మార్చి నెల ఆరంభంలోనే బీజేపీ ఎమ్మెల్సీలు ఇద్దరు పుట్టన్న, బాబురావు తమ పదవులకు రాజీనామా చేసి...కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పుట్టన్నకు ఇప్పటికే కాంగ్రెస్ రాజాజీనగర్ అసెంబ్లీ సీటును కేటాయించింది. బాబురావుకు గర్మిత్కల్ శ్రీనివాస్‌కు గుబ్బీ సీటు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీనివాస్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. శ్రీనివాస్‌తో పాటు ఆయన మద్దతుదారులు కూడా పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస్ చేరికపై పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మాట్లాడుతూ చాలాకాలంగా శ్రీనివాస్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని, ఇప్పుడు ప్రజల స్పందనను గమనించి కాంగ్రెస్‌లో చేరారన్నారు. శ్రీనివాస్ చేరికతో తుమకూరులోనే కాకుండా పాత మైసూరు ప్రాంతంలోనూ కాంగ్రెస్ పటిష్ఠవంతం అవుతుందని శివకుమార్ తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జేడీఎస్‌లో పనిచేసిన 37 మంది నాయకులు తమ పార్టీలో చేరారని, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీలు పుట్టన్న, బాబురావు సహా అనేకమంది కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారని వివరించారు. కాంగ్రెస్‌లో చేరడానికి పెద్దసంఖ్యలో నాయకులు ఉవ్విళ్లూరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో విడతల వారీగా చేరికలు ఉంటాయని చెప్పారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తిరిగి సొంతింటికి వచ్చినట్లు ఉందన్నారు. గతంలో తాను, తన తండ్రి కాంగ్రెస్‌లో పనిచేశామని గుర్తుచేశారు. జేడీఎస్‌ను వదలాలన్న ఉద్దేశం తనకు లేదని, అయితే, బలవంతంగా తనను పంపారని ఆయన ఆరోపించారు. తాను పార్టీలో ఉన్నప్పటికీ 2021లోనే తన సీటుకు వేరే అభ్యర్థిని కుమారస్వామి ప్రకటించారన్నారు. అదేసమయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దేవెగౌడ ఓటమికి తనను బాధ్యుడిని చేశారన్నారు. తాను ఏనాడు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని, నిజాయతీగానే పార్టీ కోసం పనిచేశానని వివరించారు. తన తప్పు లేకుండానే జేడీఎస్ నుంచి తనను పంపారని ఆరోపించారు. గతంలో సిద్ధరామయ్యకు ఇదే అనుభవం జరిగిందన్నారు. శ్రీనివాస్ సొంతపార్టీలోకి రావడంపై మాజీ సీఎం సిద్ధరామయ్య సంతోషం వెలిబుచ్చారు. జేడీఎస్‌లో దేవెగౌడ, కుమారస్వామి, ఆ కుటుంబం ఏమి చెబితే అదే అంతిమమని సిద్ధరామయ్య చెప్పారు. అక్కడ భావప్రకటనా స్వేచ్ఛ లేదన్నారు. జేడీఎస్‌లో ఎవరైనా ఆ నాయకులను ధిక్కరించినా...వారి అభిప్రాయానికి వ్యతిరేకంగా వాణి వినిపించినా ఆ పార్టీలో నిలవలేరని ఆయన వివరించారు. నాడు తనకు...నేడు శ్రీనివాస్‌కు ఇదే జరిగిందని చెప్పారు. బీజేపీ అవినీతి నుంచి రాష్ట్రాన్ని కాపాడటం, వ్యవస్థలను చక్కదిద్దడం కాంగ్రెస్ మాత్రమే చేయగలదని నాయకులు, ప్రజలు నమ్ముతున్నారని, అందుకే కాంగ్రెస్‌లో చేరికలు పెరుగుతున్నాయని చెప్పారు. జేడీఎస్ ఎప్పటికీ ఒంటరిగా అధికారంలోకి రాలేదని, ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకూడదని కోరుకుంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఒక్కటే అధికారంలోకి వస్తుందని, బీజేపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుతుందని సిద్ధరామయ్య దీమాగా చెప్పారు. చిక్కమగళూరు జిల్లా ముదిగెరెకు చెందిన బీజేపీ నాయకుడు హలప్ప కూడా కాంగ్రెస్‌లో చేరారు.

బొమ్మైపై డీకే ఆగ్రహం

బీజేపీ ఎమ్మెల్యేలను తాము ప్రలోభ పెడుతున్నామని, టికెట్లు ఇస్తామని ఫోన్లు చేస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ తోసిపుచ్చారు. కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలను ఫిరాయింపుల ద్వారా తమవైపునకు తిప్పుకొని సంకీర్ణ ప్రభుత్వం నడుపుతున్న బొమ్మైకి తమపై ఆరోపణలు చేసే నైతికహక్కు లేదని శివకుమార్ చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలో అవినీతి విశృంఖలమైందని, ఆవు మూత్రం, పేడను సైతం బీజేపీ ప్రభుత్వం వదలడం లేదని మండిపడ్డారు. 'నేను బీజేపీ ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు ముఖ్యమంత్రి చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి 13 మంది, జేడీఎస్ నుంచి ముగ్గురు, ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. నిర్లజ్జగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర మీది. అలాంటి మీకు మమ్ములను విమర్శించే అర్హత ఎక్కడిది' అని శివకుమార్ సూటిగా ప్రశ్నించారు. 'ఆపరేషన్ లోటస్ పేరుతో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ఇన్ని రోజులు మీరు అధికారాన్ని అనుభవించారు. మీకు నైతికత ఎక్కడిది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 112 మంది సభ్యుల బలాన్ని మీకు ప్రజలు ఇవ్వకపోయినా అనైతికంగా మీరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మీది ముమ్మాటికీ సంకీర్ణ ప్రభుత్వమే' అని శివకుమార్ ఆగ్రహం వెలిబుచ్చారు.

'పెరుగు' పేరు మార్పుపై వివాదం

- ఆదేశాలను సవరించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- ప్రాంతీయ పేరును ముద్రించేందుకు అనుమతి

న్యూఢిల్లీ: భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పెరుగు ప్యాకెట్లపై హిందీ భాషలోనే పేరును ముద్రించాలని జారీ చేసిన ఆదేశాలపై రాజకీయ దుమారం రేగడంతో గురువారం తన ఆదేశాలను సవరించింది. పెరుగు ప్యాకెట్లపై ముద్రించే లేబుళ్లలో ప్రాంతీయ పేర్లను ఉపయోగించడాన్ని అనుమతించింది. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు (ఎఫ్‌బీఓలు) ఇప్పుడు 'కర్డ్' పదంతో పాటు లేబుల్‌పై బ్రాకెట్‌లలో ఏదైనా ఇతర ప్రబలంగా ఉన్న ప్రాంతీయ సాధారణ పేరును ఉపయోగించవచ్చని తెలిపింది. ఉదాహరణకు 'కర్డ్ (దహి)' లేదా 'కర్డ్ (మోసారు), 'కర్డ్ (జాముత్‌దాద్)', 'కర్డ్ (పెరుగు)', 'కర్డ్ (తయిర్)' పేర్లను ముద్రించవచ్చని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఒక ప్రకటనలో తెలిపారు.

అసలేమయిందంటే...: ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇటీవల తమిళనాడు మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ కు 'పెరుగు' పేరుపై కొన్ని ఆదేశాలు జారీ చేసింది. పెరుగు ప్యాకెట్లపై ఆంగ్లంలో ఉన్న 'కర్డ్', తమిళంలో ఉన్న 'తయిర్' పేర్లను తొలగించి.. 'దహీ' అని హిందీలోకి మార్చాలని ఆ ఉత్తర్వుల సారాంశం. కేవలం పెరుగు మాత్రమే గాక.. నెయ్యి, చీజ్ వంటి డైరీ ఉత్పత్తుల పేర్లను కూడా ఇలాగే మార్చాలని ఆదేశించింది. తమిళనాడు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు కూడా ఇలాంటి ఉత్తర్వులే పంపినట్లు తెలిసింది. అయితే ఈ ఆదేశాలపై తమిళనాట తీవ్ర ఆగ్రహం వెల్లువెత్తింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్ణయాన్ని పాల ఉత్పత్తిదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అటు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా ఈ ఆదేశాలపై మండిపడ్డారు. 'హిందీని బలవంతంగా రుద్దాలనే వారి పట్టుదల మరింత పెరుగుతోంది. చివరకు పెరుగు ప్యాకెట్‌పైనా మా సొంత భాషలో ఉన్న పేరును మార్చేసి హిందీలో రాయమని చెబుతున్నారు. మాతృభాషల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం పనికిరాదు. దీనికి బాధ్యులైన వారిని(కేంద్రాన్ని ఉద్దేశిస్తూ) దక్షిణాది శాశ్వతంగా బహిష్కరిస్తుంది' అని స్టాలిన్ ధ్వజమెత్తారు. మరోవైపు ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఈ ఉత్తర్వును తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై కూడా తప్పుపట్టారు. స్థానిక భాషలకు వ్యతిరేకంగా ఉన్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాసిన ఒక లేఖలో కోరారు. తమిళనాడు, కర్ణాటకకు చెందిన పాల ఉత్పత్తిదారులు, పాల సంఘాలు కూడా దీనిపై తీవ్రంగా మండిపడ్డాయి. పెరుగును స్థానిక భాషలోనే పేర్కొంటామని 'దహీ'గా హిందీలో లేబుల్స్‌పై ముద్రించబోమని స్పష్టం చేశాయి.

అమృత్‌పాల్ కోసం డ్రోన్లతో పోలీసు వేట

ప్రతివాహనాన్ని తనిఖీ చేస్తున్న ఖాకీలు

హోషియార్పూర్/చండీగఢ్: ఖలిస్తానీ సానుభూతిపరుడు, వారిస్ పంజాబ్ దే చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ఆచూకి తెలియకపోవడంతో ఆయన కోసం డ్రోన్లతో గాలింపు చర్యలను పోలీసులు చేపట్టారు. గురువారం హోషియా ర్పూర్ జిల్లా మార్నేనియన్ గ్రామంలో డ్రోన్లను రంగంలోకి దించడమే కాకుండా వచ్చే-పోయే వాహనాలన్నిం టిని తనిఖీ చేశారు. ఇప్పటికే పారామిలటరీ సిబ్బంది గ్రామాన్ని మోహరిం చారు. మంగళవారం రాత్రి అమృత్‌పాల్ సింగ్, ఆయన అనుచరులు ఉన్న ట్లుగా అనుమానించిన ఓ కారును పోలీసులు వెంబడించారు. అయితే అందు లోని వారు ఆ వాహనాన్ని గ్రామంలో వదిలేసి మరొక కారులో తప్పించుకు న్నట్లు అనుమానాలు ఉన్నాయి. పోలీసులు ఆ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీలు చేపట్టిన ప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టరు.

348 మంది అరెస్టు-విడుదల: పంజాబ్ ప్రభుత్వం

అమృత్‌పాల్ కోసం జరిపిన పోలీసు ఆపరేషన్‌లో 360 మందిని ముందస్తుగా అరెస్టు చేయగా వారిలో 348 మందిని విడుదల చేసినట్లు అకల్‌తఖ్త్‌కు పంజాబ్ ప్రభుత్వం వెల్లడించింది. మిగిలిన వారిని త్వరలోనే విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు సందేశం వచ్చినట్లు అకల్ తఖ్త్ జాటేదార్ వ్యక్తిగత కార్యదర్శి జస్పాల్ సింగ్ గురువారం తెలిపారు. పట్టుబడ్డ సిక్కు యువకులు అందరినీ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అకల్ తఖ్త్ జాటేదార్ జ్ఞాని హర్‌ప్రీత్ సింగ్ ఈ వారం మొదట్లో అల్టిమేటం ఇచ్చారు. అంతకుముందు పంజాబ్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో 30 మంది వరకు కరడుగట్టిన నేరస్తుల ఉన్నారని చెప్పారు. మిగతా వారి గురించి తనిఖీలు జరిగాక అంతా బాగుంటే విడుదల చేస్తామని సీనియర్ పోలీసు అధికారి అన్నారు. అటు అమృత్‌సర్, భటిండాలో పహారాను పెంచారు. అమృత్‌సర్‌లోని స్వర్ణాలయం లేక భటిండాలోని తఖ్త్ శ్రీ దందమా సాహిబ్‌లోకి ప్రవేశించిన తర్వాత అమృత్‌పాల్ తనంతట తానుగా లొంగిపోయే అవకాశమున్నట్లు తెలిసింది.

అంతా గమనిస్తున్నాం...

- రాహుల్ కోర్టు కేసు, అనర్హత వేటుపై స్పందించిన జర్మనీ
- అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యానికి తెరతీశారన్న అధికార పక్షం
- బీజేపీ, కాంగ్రెస్ మధ్య కొనసాగిన మాటల యుద్ధం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటుతో ఆ పార్టీకి అధికార బీజేపీకి మధ్య మాటలయుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. జర్మనీ కూడా ఈ వ్యవహారంలో స్పందించడంతో వివాదం మరింత ముదిరింది. అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యానికి తెరతీశారంటూ కాంగ్రెస్‌పై బీజేపీ మండిపడింది. రాహుల్ గాంధీపై వేటు ద్వారా భారత్‌లో ప్రజాస్వామ్యం ఏ విధంగా రాజీ పడాల్సి వస్తుందన్న విషయాన్ని గమనించినందుకు కృతజ్ఞతలంటూ జర్మన్ విదేశాంగ శాఖ, డచ్‌వెల్లే చీఫ్ ఇంటర్నేషనల్ ఎడిటర్ రిచర్డ్ వాల్కర్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చెప్పడం అగ్గిని మరింతగా రాజేసింది. వాల్కర్ చేసిన ఓ ట్వీట్‌ను సింగ్ ట్యాగ్ చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు మీద జర్మన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పందించిన వీడియోను సీనియర్ జర్నలిస్టు ఒకరు పోస్టు చేశారు. అందులో విలేకరుల సమావేశంలో జర్మనీ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాట్లాడుతూ 'భారతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకు శిక్ష, ఆ వెంటనే పార్లమెంటు సభ్యత్వం రద్దు కావడాన్ని గమనించాం. మాకు తెలిసినంత వరకు ఈ తీర్పును సవాల్ చేసే పరిస్థితిలో రాహుల్ గాంధీ ఉన్నారు. దీంతో ఆయన సభ్యత్వం రద్దు విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. రాహుల్ గాంధీ వ్యవహారంలో న్యాయ స్వతంత్రతా ప్రమాణాలు, ప్రాథమిక ప్రజాస్వామిక సిద్ధాంతాలు సమానస్థాయిలో అమలవుతాయని జర్మనీ ఆశిస్తోంది' అని అన్నారు. దిగ్విజయ్ సింగ్ ట్వీట్ స్క్రీన్‌షాట్‌ను కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజిజు పంచుకుంటూ 'ధన్యవాదాలు రాహుల్ గాంధీ.. అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని తెచ్చినందుకు...! భారతీయ న్యాయవ్యవస్థ విదేశీ జోక్యంతో ప్రభావితం కాబోదని గుర్తుపెట్టుకోవాలి. మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాబట్టి విదేశీ జోక్యాన్ని భారత్ సహించబోదు' అని వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందిస్తూ 'ప్రధాన అంశంపై నుంచి ఎందుకని దృష్టి మళ్లిస్తున్నారు? అదానీ గురించి రాహుల్ గాంధీ ప్రశ్నలకు ప్రధాని సమాధానాలు ఇవ్వలేకపోవడమే ప్రధానాంశం. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి బదులు అడిగిన ప్రశ్నలకు దయచేసి సమాధానాలు ఇవ్వండి' అని వ్యాఖ్యానించారు. బీజేపీ మంత్రులు అనురాగ్ ఠాకూర్, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్ సైతం ట్విట్టర్‌లో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఇటీవల యూరప్, అమెరికా జోక్యాన్ని రాహుల్ గాంధీ కోరారు. ఇప్పుడు దిగ్విజయ్ సింగ్ అలాగే చేస్తున్నారు. చట్టం దాని పనిని అది చేసుకుపోతుంది అని వ్యాఖ్యానించారు. అమెరికా కూడా ఈ మధ్యనే రాహుల్ గాంధీ కోర్టు కేసును నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది. ప్రజాస్వామిక సూత్రాలు, మానవహక్కులు, భావప్రకటన స్వేచ్ఛ పరిరక్షణకు భారత్‌తో పాటు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. రాహుల్ గాంధీ లండన్‌లో చేసిన వ్యాఖ్యలు భారత పార్లమెంటును కుదిపివేసిన విషయం విదితమే.

రాహుల్‌పై బ్రిటన్ కోర్టులో కేసు పెడతా: లలిత్ మోదీ

న్యూఢిల్లీ: భారత్‌లో ఆర్థిక అవకతవకల ఆరోపణలెదుర్కొంటూ విదేశాలకు పారిపోయిన ఐపీఎల్ మాజీ చీఫ్ లలిత్ మోదీ... కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ ఇంటి పేరుపై చేసిన వ్యాఖ్యలకు రాహుల్‌పై బ్రిటన్ కోర్టులో కేసు పెడతానని హెచ్చరించారు. తానెన్నడూ అవినీతికి పాల్పడనప్పటికీ కాంగ్రెస్ నాయకులు తనను 'చట్టం నుంచి తప్పించుకుంటున్న వ్యక్తి'గా ఆరోపిస్తుండటం తనను తీవ్రంగా కలచివేస్తోందని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వరుస ట్వీట్లు చేశారు. తనను 'పరారైన వ్యక్తి'గా ఏ విధంగా ముద్ర వేస్తారని ప్రశ్నించారు. తాను దోషినని న్యాయస్థానాలేవీ తీర్పు చెప్పలేదని, అందువల్ల తాను సాధారణ పౌరుడినని చెప్పారు. ఇదంతా ప్రతిపక్ష నేతల కక్షసాధింపు చర్య అని మండిపడ్డారు. "నేను చట్టం నుంచి తప్పించుకుని, విదేశాలకు పారిపోయిన వ్యక్తినని ఎవరు పడితే వారు, గాంధీ సహచరులు మళ్లీ మళ్లీ చెప్తుండటం చూస్తున్నాను. ఎందుకు? ఎలా? నేను దోషినని ఈ రోజు వరకు ఎప్పుడైనా తీర్పు వచ్చిందా? పప్పు వురఫ్ రాహుల్ గాంధీ మాదిరిగా కాకుండా, నేను ఇప్పుడు ఓ సాధారణ పౌరుడిని... నేను చెప్తున్నాను, ప్రతిపక్ష నేతల్లో ప్రతి ఒక్కరికీ మరొక పని ఏమీ లేదు... వారికి కూడా సరైన సమాచారం లేకపోవచ్చు లేదా కేవలం కక్ష సాధించడానికి వారు ముందడుగు వేస్తుండవచ్చు... కనీసం రాహుల్ గాంధీనైనా ఇప్పుడే బ్రిటన్ కోర్టుకు లాక్కెళ్లాలని నేను నిర్ణయించుకున్నాను... ఆయన స్పష్టమైన సాక్ష్యాధారాలతో రావలసి ఉంటుందని కచ్చితంగా చెప్పగలను... ఆయన తనను తాను పరిపూర్ణ మూర్ఖుడిగా చేసుకోవడాన్ని చూడాలని నేను ఎదురు చూస్తున్నాను. గాంధీ కుటుంబం తరపున సంచులు మోసే ఆర్‌కే ధావన్, సీతారామ్ కేసరి, మోతీలాల్ వోరా, సతీశ్ శర్మ, నారాయణ్ దత్ తివారీ వంటివారికి విదేశాల్లో ఆస్తులు ఎలా వచ్చాయి? కమల్‌నాథ్‌ను అడగండి" అని ఓ ట్వీట్‌లో లలిత్ మోదీ పేర్కొన్నారు. తాను ఇప్పటి వరకు పైసా అయినా తీసుకున్నట్లు గడచిన 15 ఏళ్లలో రుజువు కాలేదని, ఈ ప్రపంచంలో అత్యద్భుతమైన స్పోర్టింగ్ ఈవెంట్‌ను నేను సృష్టించానని స్పష్టంగా రుజువైందని, దీనివల్ల దాదాపు 100 బిలియన్ డాలర్ల సంపద వచ్చిందని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

జావేద్ అఖ్తర్‌కు లండన్ వర్సిటీ గౌరవ డాక్టరేట్

ముంబై: హిందీ గేయ రచయిత జావేద్ అఖ్తర్‌ను ఎస్ఓఏఎస్ (స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్) లండన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించనుంది. కవిగా, రచయితగా, స్క్రీన్ రైటర్‌గా భారతీయ సినిమాకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డిఎల్ఐటి) గౌరవ పురస్కారాన్ని అందుకోనున్నారు. అందుకుంటారు. ఈ మేరకు అక్తర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నేను చాలా గొప్పగా గౌరవించబడ్డాను... ఎందుకంటే లండన్ విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన విశ్వవిద్యాలయాలలో ఒకటి' అని 78 ఏళ్ల అఖ్తర్ పేర్కొన్నారు. ప్రజా జీవితం లేదా పాఠశాల మిషన్‌కు సంబంధించిన రంగాలలో అత్యుత్తమ సేవలందించిన వ్యక్తులకు లండన్ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్, గౌరవ డాక్టరేట్‌లను అందజేస్తుంది.

ప్రధానికి రక్షణగా అంతర్జాతీయ నేరస్థులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీని కోర్టుకీడుస్తానన్న ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీకి రక్షణగా అంతర్జాతీయ నేరగాళ్లు (గ్లోబల్ స్కాంస్టర్లు) వస్తున్నారని ఎద్దేవా చేసింది. లలిత్ మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ... లలిత్ మోదీ లక్షలాది డాలర్ల మోసాలకు పాల్పడినందునే దేశం వదిలి పరారయ్యాడని, బీజేపీ ప్రభుత్వ నిష్క్రియాపర్వం కారణంగా ఆయన ఇప్పుడు విదేశాల్లో ఖరీదైన జీవితాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేరా బీజేపీపై విరుచుకుపడుతూ... 'రాహుల్‌జీని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించేందుకు సాహెబ్ ఇప్పుడు విదేశాల నుంచి సహాయం తీసుకుంటున్నారా? రాహుల్ గాంధీపై కేసు పెట్టేలా నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా తదితరులపై ఒత్తిడి తెస్తారా?' అంటూ ప్రశ్నించారు.

రాజస్థానీ నాటకానికి ఏడు 'మెటా' అవార్డులు

న్యూఢిల్లీ: రాజస్థానీ నాటకం 'హుంకారో' ఏడు 'మెటా' అవార్డులను కైవసం చేసుకుంది. మహీంద్రా ఎక్సలెన్స్ ఇన్ థియేటర్ అవార్డ్స్ (మెటా) 2023 18వ ఎడిషన్‌లో 'హుంకారో' 13 విభాగాలలో ఏడు అవార్డులను గెలుచుకోవడం విశేషం. మహీంద్రా గ్రూప్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. మార్చి 23 నుంచి వారం రోజుల థియేటర్ ప్రదర్శనల తర్వాత బుధవారం అవార్డుల ప్రదానంతో ఉత్సవం ముగిసింది. మోహిత్ తకల్కర్ దర్శకత్వం వహించి జైపూర్‌కు చెందిన ఉజాగర్ డ్రమాటిక్ అసోసియేషన్ నిర్మించిన 'హుంకారో'... లైట్ డిజైన్ (విక్రాంత్ థాకర్), కాస్ట్యూమ్ డిజైన్ (దేవికా కాలే), ఒరిజినల్ స్క్రిప్ట్ (చిరాగ్ ఖండేల్‌వాల్, అరవింద్ చరణ్), దర్శకత్వం, ఉత్తమ రంగస్థల రూపకల్పన, (మోహిత్ తకల్కర్), ప్రొడక్షన్ తదితర మొత్తం ఏడు విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచి అవార్డులను అందుకుంది. 'హుంకారో' అనేది మూడు కథల చమత్కార సమాహారం. ఇది ఆశ బలం, ఆశ లేని జీవితాన్ని కొనసాగించడం అసాధ్యం అనే దాని గురించి తెలియజేస్తుంది. 90 నిమిషాల ప్రదర్శనలో సమకాలీన రాజస్థానీ రచయితలు అరవింద్ చరణ్, చిరాగ్ ఖండేల్వాల్, ప్రఖ్యాత రాజస్థానీ రచయిత విజయదాన్ దేథా మూడు శక్తివంతమైన కథనాలను వర్ణించారు. ఈ అవార్డులకు 400పైగా ఎంట్రీలు రాగా అవార్డు నిర్ణాయక కమిటీ 10 నాటకాలను ఎంపిక చేసింది.

షిండే-ఫడ్నవిస్ సర్కార్‌కు సిగ్గులేదు

ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ విమర్శ

నాసిక్: విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు సైతం స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తంచేసినా...షిండే-ఫడ్నవిస్ ప్రభుత్వం నిర్లజ్జగా వ్యవహరిస్తున్నాయని మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, ఎన్‌సీపీ నాయకుడు అజిత్ పవార్ విమర్శించారు. ఔరంగాబాద్‌లో బుధవారం రాత్రి జరిగిన సామూహిక హింసను ప్రస్తావిస్తూ శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. విద్వేష ప్రసంగాలు చేసే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో మహారాష్ట్ర సహా అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతున్నారని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. 'రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్ల మేము ధిక్కర పిటిషన్‌ను విచారిస్తున్నాం. విద్వేష ప్రసంగాలపై చర్యలు తీసుకునే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాలలో కనిపించడం లేదు. దీనిపైనా మేము మౌనంగా ఉండటం సరికాదు' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ అసమర్థ ప్రభుత్వంగా సుప్రీంకోర్టు అభివర్ణించిందని, ఇది మహారాష్ట్రకు అవమానం కాదా అని పవార్ ప్రశ్నించారు. షిండే-ఫడ్నవిస్ ప్రభుత్వాలు సిగ్గుతో తల దించుకోవాలని వ్యాఖ్యానించారు. ఏ ప్రభుత్వంపైనా ఇప్పటి వరకు సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని గుర్తుచేశారు. నాసిక్ పర్యటనకు వచ్చిన అజిత్ పవార్ గురువారం మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేసిందో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. విద్వేష ప్రసంగాలపై ప్రతిపక్షాలు పదేపదే ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. రాజకీయాలు, మతం వేర్వేరని గతంలోనూ సుప్రీం స్పష్టంచేసిందని తెలిపారు. మత విద్వేషాలు వ్యాప్తికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయని పవార్ హెచ్చరించారు.

అటవీ బిల్లును స్థాయి సంఘానికి పంపాలి

స్పీకర్ ఓం బిర్లాకు మనీశ్ తివారీ లేఖ

న్యూఢిల్లీ: అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, 2023ని స్టాండింగ్ కమిటీ (స్థాయి సంఘం) పరిశీలనకు పంపాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు గురువారం కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ లేఖ రాశారు. దానిని సంయుక్త కమిటీకి పంపడాన్ని తప్పుపట్టారు. కేంద్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే స్థాయి సంఘాన్ని పక్కకు పెట్టేస్తోందని విమర్శించారు. ఈ బిల్లును స్థాయి సంఘానికి బదులు సంయుక్త సంఘానికి పంపడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యతిరేకించారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌కు లేఖలో తన వ్యతిరేకతను ఆయన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తివారీ లేఖకు ప్రాధాన్యత ఏర్పడింది. అటవీ (సంరక్షణ) సవరణ బిల్లును కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టగా దానిని ఉభయ సభల్లో చర్చ దృష్ట్యా సంయుక్త సంఘానికి సిఫార్సు చేశారు. శాస్త్రీయ సాంకేతికత, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుపై స్థాయి సంఘం పరిధి అంశానికి చెందిన బిల్లును సంయుక్త సంఘానికి సిఫార్సు చేయడం అనవసరం అని ఆనంద్ సాహిబ్ ఎంపీ అన్నారని లేఖలో బిర్లా దృష్టికి తివారీ తీసుకెళ్లారు. ఉభయ సభలకు చెందిన సభ్యులు స్థాయి సంఘంలో ఉన్నట్లు గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇలా చేసిందని ఆరోపించారు. స్థాయి సంఘం పరిశీలనకు పంపితే బిల్లును నిశితంగా పరిశీలించవచ్చని పేర్కొన్నారు. తాజా పరిణామాల క్రమంలో సరైన పార్లమెంటరీ నిబంధనలు, ప్రక్రియలను అనుసరించడం గౌరవంగా ఉంటుందని ఓంబిర్లాకు తివారీ సూచించారు.

మెట్లబావి పైకప్పు కూలి 12మంది మృతి

ఇండోర్‌లో విషాదం

ఇండోర్: పండగ పూట మధ్యప్రదేశ్‌లో విషాదం చోటుచేసుకుంది. ఇండోర్‌లోని బాలేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రాంగణంలో మెట్ల బావి కూలి 12 మంది దుర్మరణం చెందారు. వీరిలో 10మంది మహిళలు ఉన్నారు. సహాయ సిబ్బంది 19 మందిని రక్షించారు. కూలిపోయిన బావి కనీసం 50-60 అడుగుల లోతులో ఉంది. బావిలో నాలుగైదు అడుగుల మేర నీరు ఉంది. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం ఆలయంలో ఉత్సవాలు జరుగుతుండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థలం సరిపోక ఆలయంలో ఉన్న పురాతన మెట్లబావిపై కొందరు భక్తులు కూర్చున్నారు. ఈ సమయంలోనే బావి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో దాదాపు 25 మంది బావిలో పడిపోయారు. ఈ ఆలయం, మెట్ల బావి సుమారు 60 సంవత్సరాల క్రితం నాటివిగా చెబుతున్నారు. మెట్ల బావి పైన నిర్మించిన డాబాపై దాదాపు 20 నుంచి 25 మంది వరకు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అధిక బరువు కారణంగా పైకప్పు కూలిపోయిందని వారు తెలిపారు. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఇతర శాఖల అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో అనేక మందిని బావి నుంచి బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. మరికొన్ని మృతదేహాలను కూడా వెలికితీశారు. బావిలో ఇంకా ఎంతమంది ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్‌తో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు ప్రధాని మోదీ ట్వీట్‌లో తెలిపారు. ఘటనలో మరణించిన వారి బంధువులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 ఇస్తామని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

బెంగాల్, గుజరాత్‌లో 'రామనవమి' హింస

- రాళ్లదాడులు, వాహనాలకు నిప్పు, దుకాణాలు ధ్వంసం-లూటీ
- దోషులను ఉపేక్షించేది లేదు-అల్లరిమూకలు దేశానికి శత్రువులు: మమతా బెనర్జీ

హౌరా/వడోదర: ఉత్సవ ఊరేగింపుల ముసుగులో హిందుత్వ మూకల హింస కొనసాగుతోంది. గుజరాత్, బెంగాల్ రాష్ట్రాల్లో రామనవమి ఊరేగింపులలో హింస చెలరేగింది. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. అనేక వాహనాలు దగ్ధమయ్యాయి. దుకాణాల్లో లూటీ జరిగింది. అనేకమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజా పరిణామాలను తీవ్రంగా పరిగణించారు. అల్లరిమూకలు దేశానికి శత్రువులని, అల్లర్ల దోషులను ఉపేక్షించబోమన్నారు. బెంగాల్, హౌరాలోని కజిపారా ప్రాంతం గుండా ఊరేగింపు సాగే సమయంలో హింస జరిగిందని పోలీసు అధికారి చెప్పారు. అనేక దుకాణాలు, ఆటోలు ధ్వంసమయ్యాయని, కార్లు, పోలీసుల వాహనాలకు మూకలు నిప్పుపెట్టినట్లు తెలిపారు. నాలుగు అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి మంటలను అదుపు చేయగలిగినట్లు వెల్లడించారు. అల్లరి మూకలను చెదరగొట్టేందుకు బలప్రయోగం తప్పలేదని పోలీసులు చెప్పారు. సీఎం మమత ఈ ఘటనపై స్పందిస్తూ 'రామనవమి ఊరేగింపులను ఆపమని చాలాసార్లు చెప్పారు. పోలీసులకూ ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఒక వర్గం అన్నపూర్ణ పూజ జరుపుకుంటోంది. మరో వర్గం రంజాన్ ఉపవాసాల్లో ఉంది. తాజా హింసకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదు. అల్లరి మూకలను సమర్థించను. అలాంటివారిని దేశానికి శత్రువులుగా పరిగణిస్తా. బీజేపీ ఎల్లప్పుడూ హౌరాను లక్ష్యంగా చేసుకుంటోంది. పార్క్ సర్కస్, ఇస్లాంపూర్ కూడా వారి లక్షితప్రాంతాలు. ఆ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి' అని అన్నారు. మమత ఆరోపణలను బీజేపీ నేత సువేందు అధికారి నిరాధారమైనవిగా తోసిపుచ్చారు. ఈ హింసకు ముఖ్యమంత్రి, రాష్ట్ర యంత్రాంగమే బాధ్యత వహించాలని

అన్నారు. మరోవైపు గుజరాత్‌లోని వడోదరలో రెండు రామనవమి ఊరేగింపుల్లో రాళ్లదాడులు జరిగాయి. ఈ ఘటనల్లో కొందరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కుంభర్వాడలో రాళ్లరువ్వుకున్న ఘటనలో మహిళలతో సహా కొందరికి గాయాలయ్యాయి. ఫత్తేపూర్, పంజిరిగర్‌లో ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్వర్యంలో పంజిరిగర్ మీదుగా ఊరేగింపు సాగింది. మిగతా ఊరేగింపులను స్థానికులు నిర్వహించారు. కుంభర్వాడ ఊరేగింపులో బీజేపీ ఎమ్మెల్యే మనీషా వకీల్ పాల్గొన్నారు. శాంతియుతంగా సాగే శోభయాత్రపై కొందరు రాళ్లు రువ్విన్నట్లు ఆమె ఆరోపించారు. రాళ్లదాడి క్రమంలో జనం చెల్లాచెదురైన దృశ్యాలు వీడియోల్లో కనిపించాయి. సీసీటీవీ ఫుటేజి ఆధారంగా రాళ్లు విసిరిన వారిని పట్టుకుంటామని నగర పోలీసు కమిషనర్ షంషేర్ సింగ్ తెలిపారు. ఘటనాస్థలిని సందర్శించింది పరిస్థితిని సమీక్షించారు. దాడి జరిగిన సమయంలో పోలీసులు కనుచూపుమేర లేరని బజరంగ్ దళ్ నేత ఒకరు ఆరోపించగా డీసీపీ యశ్‌పాల్ జగనియా ఆయన ఆరోపణలను తోసిపుచ్చారు. ఇది మతపరమైన హింస కాదని ఆయన స్పష్టంచేశారు. ఫత్తేపురా మసీదు వద్ద జనం గుమ్మిగూడగా వారిని చెదరగొట్టామని, అదే మార్గంలో ఊరేగింపు ముందుకెళ్లిందని చెప్పారు.

పార్లమెంట్ కొత్త భవనం పరిశీలించిన మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. తుది దశలో ఉన్న నిర్మాణ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భవనంలోని సెంట్రల్ హాల్‌లో టేబుళ్లు, నడక మార్గాల్లో కలియ తిరుగుతూ దాదాపు గంట సమయం ప్రధాని అక్కడే ఉండి జరుగుతున్న పనులన్నింటినీ పరిశీలించి పనిచేస్తున్న కార్మికులు, అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రధాని వెంట లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఉన్నారు. గతేడాది నవంబర్ నాటికే నిర్మాణం పూర్తి చేయాలని భావించినప్పటికీ కరోనా కారణంగా ఆలస్యమైంది. ఈ నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉంది. అత్యాధునిక వసతులతో నిర్మాణం చేపట్టిన పార్లమెంట్ కొత్త భవనానికి 2020 డిసెంబర్‌లో శంకుస్థాపన చేశారు. దాదాపు 13 ఎకరాల విస్తీర్ణంలో డిజిటల్ హంగులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. కాన్‌స్టిట్యూషన్ హాల్, ఎంపీల లాంజ్, లైబ్రరీ, కమిటీ రూమ్‌లు, డైనింగ్ ప్రదేశాలు, తగినంత పార్కింగ్ స్థలం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ ప్రాజెక్టును టాటా కంపెనీ చేస్తోంది.

మరోసారి చలో ఢిల్లీ...

బీజేపీని గద్దె దించేందుకు ఐక్యపోరకు మమత పిలుపు

కోల్‌కతా: ఈ దుర్యోధన దుశ్శాసన దుర్నీతిలోకంలో భారత పౌరులు మనుగడు ఎలా సాగించగలరంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా అంతా ఏకం కావాలని, ఐక్యంగా పోరాడి కాషాయ పాలనకు చరమగీతం పాడగలమన్నారు. ఇందుకోసం అవసరమైతే ఢిల్లీకి కదం తొక్కుదామని 'మరోసారి ఢిల్లీ చలో'కు టీఎంసీ అధినేత్రి పిలుపునిచ్చారు. 'మనం అంతా ఏకం కావాలి. ఐక్యంగా బీజేపీపై పోరాడాలి. దానిని ఓడించాలి. అవసరమైతే ఢిల్లీకి కదం తొక్కుదాం. దేశ ఫెడరల్ వ్యవస్థ వినాశనానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు, బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాలకు నిధులు సమకూరేలా చేసేందుకు ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వెళదాం. కేంద్రం సంభాషణ జరుపుతుందని, మనకు రావాల్సిన బకాయిలు తీరుస్తుందని ఇప్పటివరకు అనుకున్నాగానీ అలా జరగలేదు. కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకొని నిరంకుశ పరిపాలన సాగిస్తోంది. ప్రతిపక్ష పార్టీలన్నీ అవినీతి భరితమని తమదే ఏ తప్పు చేయని పార్టీ అని చూపే ప్రయత్నం చేస్తోంది అని ఆమె విమర్శించారు. 2024 పార్లమెంటరీ ఎన్నికలు...దేశ పౌరులకు బీజేపీకి మధ్య పోరుగా పరిణమిస్తాయని అన్నారు. అన్ని మతాల వారు ఏకమై కాషాయ పార్టీని ఓడించి దేశ పేదలను కాపాడుకోవాలని కూడా మమత పిలుపునిచ్చారు. బీజేపీని దుస్సాహస, దుర్యోధనగా ఆమె అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌పై వివక్షను వ్యతిరేకిస్తూ ఆమె 30గంటల ధర్నా చేపట్టిన విషయం విదితమే. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై ఐక్యపోరునకు కలిసి రావాలని అన్ని పార్టీలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలన్న నిర్ణయాన్ని మార్చుకున్న సంకేతాలు అందుతున్నాయి. కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లోగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం పాదాల వద్ద నుంచి 'అవుర్ ఏక్‌బార్ ఢిల్లీ చలో' (మరొకసారి ఢిల్లీ వెళదాం)కు మమత పిలుపునిచ్చారు. 80ఏళ్ల కిందట సింగపూర్‌లో నేతాజీ సుభాశ్ చంద్రబోస్ ఇచ్చిన 'ఢిల్లీ చలో' పిలుపును ఆమె అనుసరించారు. మమత పిలుపుకు ఆమె మద్దతుదారుల గొంతుకలిపారు. ధర్నాస్థలికి వారంతా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారందరితో కలిసి మమత పాటలు పడుతూ నిరసనలో పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆందోళన కార్యక్రమాన్ని మమత చేపట్టారు. తమ రాష్ట్రానికి ఎంజీఎన్ఆర్ఈజీఏ, ఇతర పథకాలు, గృహ, పడబ్ల్యూడీ నిధులను నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టారు.

మోదీ లక్ష్యంగా ఆప్ పోస్టర్ వార్ ముమ్మరం

న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విధానాలపై అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పోరు ఉధృతం చేసింది. మోదీ హఠావో దేశ్ బచావో పోస్టర్లతో ఢిల్లీలో కాషాయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టర్లతో హోరెత్తించిన ఆప్ దేశవ్యాప్తంగా తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 11 భాషల్లో పోస్టర్ ప్రచారాన్ని గురువారం చేపట్టింది. ప్రధాని విద్యార్హతలపై మోదీని లక్ష్యంగా చేసుకుని ఆప్ పోస్టర్ యుద్ధానికి తెరలేపింది. భారత ప్రధానికి విద్యార్హతలు ఉండాల్సిన అవసరం ఉందా అని దేశ రాజధానిలో ఏర్పాటు చేసిన పోస్టర్లలో ఆప్ ప్రశ్నించింది. ఇటీవల ఢిల్లీలోని అన్ని గోడలు, విద్యుత్ స్తంభాలపై 'మోదీ హఠావో, దేశ్ బచావో' అన్న పోస్టర్లు వెలిసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ పోస్టర్లపై 49 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరు ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో పాటు ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసినందుకు ఈ అరెస్టులు జరిగినట్లు పోలీసులు పేర్కొనడం గమనార్హం. తాజా అరెస్టులపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తమకు వ్యతిరేకంగా పోస్టర్లు అంటించిన వారిపై బ్రిటీష్ వారు కూడా అరెస్టులకు పాల్పడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ భగత్ సింగ్ అనేకపోస్టర్లు అంటించారని, కానీ ఆయనపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని గుర్తుచేశారు. ఆప్‌కి వ్యతిరేకంగా ' కేజ్రీవాల్ హఠావో, ఢిల్లీ బచావో ' పోస్టర్లతో బీజేపీ ఎదురు దాడికి దిగింది.

రాహుల్‌ను చంపుతామంటే చర్యలు తీసుకోరా?

లక్నో: కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని, తనను చంపేస్తామని వచ్చిన బెదిరింపు కాల్‌పై ఫిర్యాదు చేస్తే లక్నో పోలీ సులు పట్టించుకోలేదని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ మీడియా కన్వీనర్ లల్లన్ కుమార్ ఆరోపించారు. ఈ విషయాన్ని ట్విట్టర్ మాధ్యమంగా లక్నో పోలీసు కమిషనర్ ఎస్‌బీ శ్రీరాడ్కర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 25న గోరఖ్‌పూర్‌కు చెందిన మనోజ్ కుమార్ అనేక వ్యక్తి ఫోన్ చేసి రాహుల్ గాంధీని కులం పేరుతో దూషించారని, ఆయనతో పాటు తననూ చంపుతానని బెదిరించాడని, గతంలోనూ ఇలానే బెదిరించాడని, ఇప్పుడు తనకు ప్రాణభయం పట్టుకుందని కుమార్ వెల్లడించారు. 25వ తేదీనే చిన్హట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఏదైన దుర్ఘటన జరగాలని వేచివున్నట్లుగా తోస్తోందన్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును ఆయన ట్విట్టర్‌లో పెట్టి, కమిషనర్‌కు ట్యాగ్ చేశారు. రోజులు గడుస్తున్నా ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదన్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి కాల్ రికార్డింగ్ లేదని, దీనిపై ఆరా తీస్తున్నామని చిన్హట్ స్టేషన్ ఇంచార్జి అలోక్ రాయ్ తెలిపారు.

అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే అనైతిక చర్య

అశ్లీల దృశ్యాలు చూస్తూ కాలక్షేపం - వైరల్ అయిన ఫొటోలు

అగర్తల: చట్టసభల్లో ప్రజావాణిని వినిపించాల్సిన బీజేపీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి అదే సభలో అనైతిక చర్యకు పాల్పడి అడ్డంగా దొరికిపోయారు. అసెంబ్లీలో అభ్యంతరకర దృశ్యాలు చూస్తూ కాలక్షేపం చేస్తున్న ఆయన చర్యలను ప్రజలు ఏవగించుకుంటున్నారు. ఒకవైపు సభ కార్యకలాపాలు నడుస్తుండగా అసెంబ్లీ వేదికగా ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూస్తూ త్రిపురలోని బాగ్‌బస్సా నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తున్న జాదవ్‌లాల్‌నాథ్ అడ్డంగా దొరికిపోయారు ఆయన ఫోన్ చూస్తున్న చిత్రాలు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ప్రజల గళం వినిపించే ప్రదేశంలో ఆ నేత వ్యవహరించిన తీరుపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సభా కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో ఆయన అభ్యంతరకర వీడియోలు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో సభలో రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ జరుగుతోంది. జాదవ్ వెనక కూర్చున్న వారు ఆయన వ్యవహారాన్ని చిత్రీకరించినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే ప్రవర్తన బీజేపీని ఇరకాటంలో పడేసింది. దీనిపై పార్టీ తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు, ఆయన్ను వివరణ కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ వీడియోల దుమారంపై ప్రస్తుతానికి ఎమ్మెల్యే నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. చట్టసభలో ఇలా అసభ్య దృశ్యాలు చూస్తూ పట్టుబడటం ఇదే మొదటిసారి కాదు. 2012లో కర్ణాటక అసెంబ్లీలో బీజేపీకి చెందిన ఇద్దరు మంత్రులు అశ్లీల దృశ్యాలు చూస్తూ దొరికిపోయారు. దాంతో వారిద్దరు తమ పదవులకు రాజీనామా చేయాల్సివచ్చింది. విచారణలో వారు ఎలాంటి తప్పు చేయలేదని తేలడం గమనార్హం.

వెంకీ 'సైంధవ్' డిసెంబర్ 22న విడుదల

హైదరాబాద్: విక్టరీ వెంకటేశ్... శైలేశ్ కొలను దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ సినిమా సైంధవ్. కెరియర్ పరంగా వెంకటేశ్ కి ఇది 75వ చిత్రం. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమాకి, సంతోష్ నారాయణ్ సంగీతాన్ని అందిస్తున్నాడు. కాగా ఈ సినిమా నుంచి వదిలిన మొదటి వీడియో చూడగానే, యాక్షన్ ఒక స్థాయిలోనే ఉంటుందనే విషయం అర్థమైపోయింది. ఆ తరువాత నుంచి ఈ సినిమాకి సంబంధించిన ఎలాంటి కబురు బయటకు రాలేదు. తాజాగా ఏకంగా సినిమా విడుదల తేదీని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ 22న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు చెబుతూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. భారీ పేలుడు పదార్థాలకు సంబంధించిన కంటైనర్ పై, తుపాకీ పట్టుకుని కూర్చున్న వెంకీ పోస్టర్ ఆకట్టుకుంటోంది. అప్పటికే ఆయన గాయపడి ఉండటం చూస్తుంటే, ఇంకా ఎవరైనా వస్తే రానీ చూసుకుందాం అన్నట్టుగా ఆయన అక్కడ కూర్చుని వెయిట్ చేస్తున్నాడనే విషయం తెలిసిపోతోంది. ఈ సినిమాలో నవాజుద్దీన్ సిద్ధికీ ఒక కీలకమైన పాత్రలో కనిపించనున్నాడు. వెంకటేశ్ గత ఏడాది 'ఎఫ్ 3' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అలాగే 'ఓరి దేవుడా' సినిమాలో ఒక ప్రత్యేకమైన పాత్రను పోషించారు.

ఆకట్టుకుంటున్న 'ఛత్రపతి' టీజర్

హైదరాబాద్: ప్రభాస్ కెరియర్లో సూపర్‌హిట్‌గా నిలిచిన సినిమాల్లో 'ఛత్రపతి' ఒకటి. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2005లో సంచలన విజయాన్ని నమోదు చేసింది. మాస్ హీరోగా ప్రభాస్ క్రేజ్ ను మరింతగా పెంచిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమాను అదే టైటిల్ తో హిందీలోకి రీమేక్ చేశారు. తెలుగులో మాస్ హీరోగా మంచి మార్కులు కొట్టేసిన బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా ఈ సినిమా రూపొందింది. సిక్స్ ప్యాక్ తో కనిపించడం కోసం గట్టి కసరత్తునే చేసి బెల్లంకొండ కెమెరా ముందుకు వెళ్లాడు. పెన్ స్టూడియోస్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాకి, వీవీ వినాయక్ దర్శకత్వం వహించాడు. గురువారం ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. భారీ మాస్ యాక్షన్ కి సంబంధించిన సన్నివేశాలపై కట్ చేసిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. మే 12వ తేదీన ఈ సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు.

రామబాణం నుంచి కొత్త పోస్టర్

హైదరాబాద్: టాలీవుడ్ హీరో గోపీచంద్ నటిస్తున్న తాజా చిత్రం రామబాణం. గోపీచంద్ 30 వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శ్రీవాసు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే మేకర్స్ విడుదల చేసిన రామబాణం ఫస్ట్ లుక్ సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. చిత్ర యూనిట్ గురువారం శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఈ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. జగపతిబాబు, గోపీచంద్ సంప్రదాయ తెలుగు రంగు దుస్తుల్లో చెయ్యిలో చెయ్యి వేసి నడుచుకుంటూ వస్తున్న లుక్ ఆకట్టుకుంటోంది. లక్ష్యం సినిమా తర్వాత జగపతిబాబు, గోపీచంద్ ఈ చిత్రంలో మరోసారి అన్నదమ్ములుగా నటిస్తున్నట్టు సమాచారం. లక్ష్యం, లౌక్యం సినిమాల తర్వాత శ్రీవాసు-గోపీచంద్ కాంబోలో మూడోసారి వస్తుండటంతో సినిమాపై ఆసక్తి, అంచనాలు భారీగానే ఉన్నాయి. కాగా ఈ సినిమాలో డింపుల్ హయతి హీరోయిన్‌గా భైరవి పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదల చేసిన భైరవి లుక్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్నారు. రామబాణంలో ఖుష్బూ సుందర్, జగపతిబాబు, సచిన్ ఖేద్కర్, నాజర్, అలీ, రాజా రవీంద్ర, వెన్నెల కిశోర్, సప్తగిరి, కాశీ విశ్వనాథ్, సత్య, గెటప్ శ్రీను, సమీర్, తరుణ్ అరోరా కీలక పాత్రలు పోషిస్తున్నారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

నేటినుంచి ఐపీఎల్ 16వ సీజన్

గుజరాత్-చెన్నై జట్ల మధ్య తొలి మ్యాచ్

ముంబై: పపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ ఐపీఎల్ 16వ సీజన్ మార్చి 31(శుక్రవారం) నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. బ్యాటర్ల అదిరిపోయే ఇన్నింగ్స్, బౌలర్ల మ్యాజిక్‌లు, ఫీల్డర్ల విన్యాసాలను చూసేందుకు అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తొలి మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ అయిన గుజరాత్ టైటాన్స్, నాలుగుసార్లు ట్రోఫీని సొంతం చేసుకున్న చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం ఇందుకు వేదిక కానుంది. మొత్తం 10 జట్లు ట్రోఫీ కోసం పోటీపడనున్నాయి. గుజరాత్ టైటాన్స్ గతేడాది వస్తూనే ట్రోఫీని ఎగరేసుకుపోయింది. ఫైనల్స్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుచేసి ట్రోఫీని సొంతం చేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్ కూడా గత ఏడాదే ఐపీఎల్‌లో అడుగుపెట్టినప్పటికీ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుజట్టు నాలుగో స్థానానికి పరిమితమైంది. ఐపీఎల్ సూపర్ పవర్స్ అయిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు చెత్త ప్రదర్శనతో వరుసగా 9, 10 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా కరోనా కారణంగా రెండేళ్ల పాటు స్వదేశానికి దూరంగా జరిగిన ఐపీఎల్ ఈసారి పూర్తిస్థాయిలో భారత్‌లో జరగబోతోంది. దీంతో ఆరంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఐపీఎల్ రంగం సిద్ధం చేసిందని, అనేకమంది సూపర్ స్టార్లు, హీరోయిన్లు ప్రారంభ వేడుకల్లో పాల్గొనబోతున్నారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, అవేవీ నిజం కాదని తాజాగా తేలింది. రష్మిక మందన్న, తమన్నా భాటియా, అరిజిత్ సింగ్ మాత్రమే ప్రదర్శన ఇవ్వనున్నట్టు ఐపీఎల్ ట్విట్టర్ ద్వారా వెల్లడించింది.

పక్కా ప్రణాళికతో ముంబై ఇండియన్స్

అయితే గతేడాది తీవ్రంగా నిరాశపరిచిన ముంబై ఇండియన్స్.. తాజా సీజన్లో పక్కా ప్రణాళికతో బరిలోకి దిగబోతుంది. కానీ ఆ జట్టుకు స్టార్ పేసర్ బుమ్రా, విధ్వంసకర బ్యాటర్ టిమ్ డేవిడ్ దూరమవ్వడం పెద్ద లోటే. కానీ గత సీజన్‌కు దూరంగా ఉన్న ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా అర్చర్ తిరిగి అందుబాటులోకి రావడం కలిసొచ్చే అంశం. ఇంకా కామెరూన్ గ్రీన్‌తో సహ మరికొంతమంది ఆటగాళ్లు కూడా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ కూడా ఈ సారి ముంబై తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఈ మెగా టోర్నీ చరిత్రలో ఐదు సార్లు ట్రోఫీని ముద్దాడిన ముంబై జట్టు ఈ సారి ఎలాగైనా కప్పు అందుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. దీని కోసం గట్టిగానే ప్రాక్టీస్ చేస్తూ శ్రమిస్తోంది. హెడ్ కోచ్ మార్క్ బౌచర్ నేతృత్వంలో బ్రబౌర్న్ వేదికగా ముంబై ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ కూడా నెట్స్‌లో తీవ్రంగా చెమటోడుస్తున్నాడు. తనదైన శైలిలో భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఓ బౌలర్ వేసిన బంతిని భారీ సిక్సర్‌గా మలిచాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన అభిమానులు... హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గత సీజన్‌లో రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. మొత్తం 14 మ్యాచులు ఆడిన అతడు.. 19.14 సగటుతో 268 పరుగులు మాత్రమే చేశాడు. అతడి వైఫల్యం కూడా జట్టు ఓటమిపై తీవ్ర ప్రభావం చూపింది. ఇక ఐపీఎల్ 2023 వేలంలో రోహిత్ శర్మ కోసం రూ.17 కోట్లను వెచ్చించింది ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్. అయితే రోహిత్ ఈ ఏడాది సీజన్లో కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు సమాచారం. అతడు అందుబాటులో లేని మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్ ఏప్రిల్ 2న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది.

ఐపీఎల్‌లో మనోళ్లపై జీపీఎస్ పరికరాల పర్యవేక్షణ

ముంబై: ఐపీఎల్‌లో భారత ఆటగాళ్లు జీపీఎస్ ఫిట్ నెస్ ట్రాకింగ్ డివైజ్‌లను ధరించి మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. కేవలం ప్రాక్టీస్ సెషన్లలోనే కాదు.. మ్యాచ్‌ల సమయంలోనూ ఆటగాళ్లు ఈ జీపీఎస్ పరికరాలు ధరించి మైదానంలోకి దిగనున్నారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ సామర్థ్యాలు, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ఎప్పటికప్పుడూ ఈ జీపీఎస్ పరికరాలు పర్యవేక్షిస్తాయి. ఈక్రమంలోనే మెగా లీగ్‌లో భారత ఆటగాళ్లు గాయపడకుండా బీసీసీఐ జీపీఎస్ ఫిట్‌నెస్ ట్రాకింగ్ డివైజ్‌లను ధరించాలని నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ తర్వాత టీమిండియా ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్ లో ఆడాల్సి ఉంది. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోవాల్సి ఉంది. దీని తర్వాత అక్టోబర్‌లో వన్డే ప్రపంచకప్ కూడా ఉంది. గత కొన్నేళ్లుగా ఐసీసీ టోర్నీల్లో టీమిండియా వరుసగా విఫలమవుతోంది. ఈ నేపథ్యంలోనే స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచకప్‌ను గెల్చుకోవడం భారత జట్టుకు చాలా ముఖ్యం. ఐపీఎల్ తర్వాత ప్రతిష్ఠాత్మక టోర్నీలు ఉన్నందున టీమిండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగానే క్రికెటర్ల సర్జీ లెవెల్, హార్ట్ బీట్, బ్లడ్ ప్రెజర్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే జీపీఎస్ ఫిట్‌నెస్ ట్రాకింగ్ డివైజ్‌లను ధరించే మ్యాచ్‌లు ఆడాలని ఆదేశించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు ఈ పరికరాలను ఉపయోగిస్తున్నాయి. భారతదేశంలోని హాకీ జట్టు ఆటగాళ్లు ఈ పరికరాన్ని ఉపయోగిస్తున్నారు. ఇటీవల మహిళల ఐపీఎల్ టోర్నీలోనూ మహిళా క్రికెటర్లు ఫిట్‌నెస్ ట్రాకింగ్ డివైస్‌లతోనే బరిలోకి దిగారు. ఇప్పుడు టీమిండియా ఆటగాళ్లు కేవలం ప్రాక్టీస్ సెషన్లలోనే కాకుండా మ్యాచుల్లోనూ వీటిని ధరించి ఆడనున్నారు.

ఐపీఎల్‌కు దూరమైన స్టార్స్ వీరే...

క్రికెట్ అభిమానులు ఈసారి ఐపీఎల్‌లో ఐదుగురు స్టార్ ఆటగాళ్లను మిస్ అవుతున్నారు. వారెవరంటే? ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాజ... ఐపీఎల్ మొత్తానికి దూరమయ్యాడు. వెన్ను నొప్పితో బాధపడుతున్న బుమ్రా చాలా కాలంగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్... గతేడాది డిసెంబరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. దీంతో అతడి స్థానంలో ఢిల్లీ కేపిటల్స్ జట్టు డేవిడ్ వార్నర్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. టీ20 క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్లలో బెయిర్‌స్టో ఒకడు. అతడు కూడా గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమయ్యాడు. మడమ స్థానభ్రంశం చెంద డంతోపాటు, విరిగిన కాలుకు ఆపరేషన్ చేయించుకుని ప్రస్తుతం కోలుకుంటున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్ జట్టు అతడి స్థానాన్ని మ్యాట్ షార్ట్‌తో భర్తీ చేసింది. కైల్ జెమీసన్ కూడా వెన్ను గాయం కారణంగా ఐపీఎల్ 2023కి దూరమయ్యాడు. మినీ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం అతడిని కొనుగోలు చేసింది. సర్జరీ కారణంగా నాలుగు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్‌కు అతడు దూరం కావడంతో దక్షిణాఫ్రికా పేసర్ సిసంద మంగలను సీఎస్‌కే తీసుకుంది. ఐపీఎల్‌కు శ్రేయాస్ అయ్యర్ దూరం కావడం కోల్‌కతా నైట్ రైడర్స్‌కు పెద్ద దెబ్బే. అయ్యర్ కూడా వెన్ను నొప్పి కారణంగానే జట్టుకు దూరమయ్యాడు. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం స్టార్ బ్యాటర్ నితీశ్ రాణాను తీసుకోవడమే కాకుండా జట్టుకు అతడిని కెప్టెన్‌గా నియమించింది.

మ్యాచ్‌లను ఉచితంగానే వీక్షించొచ్చు

ముంబై: ఐపీఎల్ టెలివిజన్ బ్రాడ్‌కాస్ట్ హక్కులను స్టార్ స్పోర్ట్స్ సొంతం చేసుకోగా, డిజిటల్ మాధ్యమ హక్కులను వయాకామ్ 18 కొనుగోలు చేసింది. అయితే, ఐపీఎల్‌ను జియో సినిమాలో పూర్తి ఉచితంగా కూడా వీక్షించొచ్చు. ఇందుకు కావాల్సిందల్లా జియో కనెక్షనే. అదొక్కటి ఉండి, సరిపడా ఇంటర్నెట్ డేటా ఉంటే ఐపీఎల్‌ను ఎంచక్కా చూసెయ్యొచ్చు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.